జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 07 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 153 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 23:09:45 వరకు నక్షత్రంశతభిష - 20:46:16 వరకు కరణంవణిజ - 10:55:14 వరకు, విష్టి - 23:09:45 వరకు పక్షంకృష్ణ యోగంశోభన - 23:22:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## 23,731 కోట్లతో 'గోబర్ధన్'

### బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం
### కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు

మిగతా 2లో..

## డ్రోన్ సర్వేపై సుప్రీంకోర్టు స్టే

### రాయదుర్గం భూముల కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): హైదరాబాద్ రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. టీజీఐఐసీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగిసిందని తెలిపింది. ఈ క్రమంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

మిగతా 2లో..

# రక్షణ శాఖ బలోపేతం దిశగా అడుగులు

- 114రఫేల్ యుద్ధ విమానాలు కొనుగోలు
- 3.25లక్షల కోట్లతో విలువైన మెగా డీల్
- ఫ్రాన్స్ నుంచి ఎట్టకేలకు ప్రతిపాదన
- మేక్ ఇన్ ఇండియావైపుకు అడుగులు



న్యూఢిల్లీ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. 114 రఫేల్ మల్టీ రోల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. దాదాపు రూ. 3.25 లక్షల కోట్ల విలువైన ఈ మెగా డీల్‌పై ఫ్రాన్స్ నుంచి ఎట్టకేలకు స్పందన వచ్చింది. భారత్‌కు తాజాగా దీనిపై సమగ్ర సాంకేతిక, వాణిజ్య ప్రతిపాదనను (టెక్నికల్ అండ్ కమర్షియల్ ప్రపోజల్) సమర్పించింది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, భారత వైమానిక దళానికి చెందిన అక్విజిషన్ వింగ్ ప్రస్తుతం ఈ ప్రపోజల్‌ను నిశితంగా పరిశీలిస్తున్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. భారత్ ఈ ఏడాది మే నెలలో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన లెటర్ ఆఫ్ రిక్వెస్ట్‌ను

మిగతా 2 లో..

## డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సహా కొన్ని డిజిటల్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించే అవకాశాన్ని కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007లో సవరణలు చేసే ఈ బిల్లు ద్వారా బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలకు కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై రుసుములు వసూలు చేసే అవకాశం కల్పించనున్నారు. లోక్‌సభ ఆమోదించిన సవరణ బిల్లు ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం

మిగతా 2 లో..



# సువర్ణాధ్యాయం

## సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

- నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక
- రజైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు
- బొగ్గు రాకపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆనందం

మంచిర్యాల,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపుర్ సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59 వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కి ఒడిశాలోని నైనీ

మిగతా 2 లో..

తెలంగాణ రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా, ఒడిశా నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి తొలి బొగ్గు రైలు విజయవంతంగా చేరుకుంది. 1,131 కిలోమీటర్ల ప్రయాణంతో సింగరేణికి తొలి రేకు చేరుకుంది. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గని నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు తరలింపు ఒక చారిత్రక అవసరం. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో కీలకమైన ఈ థర్మల్ కేంద్రానికి నాణ్యమైన బొగ్గును అందించేందుకు తొలి రైలు రేకు ఏకంగా 1,131 కిలోమీటర్లు ప్రయాణించి 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ-10 (+-10) గ్రేడ్ బొగ్గు తెలంగాణ గడ్డపైకి చేరుకుంది.

### పోలవరం-బనకచర్లకు

# అడ్డంకి

### పర్యావరణ ప్రతిపాదన వెనక్కి
### కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
### ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు



న్యూఢిల్లీ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు

మిగతా 12 లో..

## నీట్ యూజీ పరీక్షలో పెన్ అండ్ పేపర్ విధానానికి స్వస్తి

### నందన్ నీలేకన్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
### సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్ దాఖలు


న్యూఢిల్లీ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): నీట్ యూజీ పరీక్షలో పెన్ అండ్ పేపర్ విధానానికి స్వస్తి చెబుతామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జేఈఈ తరహాలో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలోని హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల మేరకు తుది నిర్ణయం

మిగతా 2 లో..

## నీట్ శిక్షణ విద్యార్థి బలవన్మరణం

విజయవాడ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): కృష్ణా జిల్లాలోని కానూరులో విషాదం చోటు చేసుకుంది. నీట్ శిక్షణ పొందుతున్న హైదరాబాద్ యువతి వైష్ణవి(19) బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్‌లోని బేగంపేటకు చెందిన వైష్ణవి నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం కృష్ణా జిల్లాలోని శ్రీ భారతి ఇన్‌స్టిట్యూట్‌లో చేరింది. మూడు వారాల

మిగతా 2 లో..



## నింగిలోకి దూసుకెళ్లిన అగ్ని 4 క్షిపణి

చండీపూర్,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): భారత్ తన వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. ఒడిశాలోని చండీపూర్ సమీకృత పరీక్షా పరిధి నుంచి మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-4ను విజయవంతంగా ప్రయోగించింది. స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రయోగం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా చేరుకొని అన్ని సాంకేతిక, కార్యాచరణ ప్రమాణాలను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రయోగం అనంతరం అగ్ని-4 నిర్దేశించిన మార్గంలో ప్రయాణించి లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవడంతో భారత క్షిపణి సాంకేతికత మరోసారి తన విశ్వసనీయతను నిరూపించింది. ఈ విజయంతో దేశీయ రక్షణ వ్యవస్థ మరింత బలోపేతమైందని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ప్రయోగానికి ముందు భద్రతా కారణాల దృష్ట్యా భారత్ 3,000 కిలోమీటర్లకు పైగా పరిధిలో ఆంక్షలను అమలు చేసింది. దీంతో ప్రయోగం అత్యంత భద్రతా ప్రమాణాల మధ్య విజయవంతంగా నిర్వహించబడింది. అగ్ని శ్రేణికి చెందిన క్షిపణులు భారత వ్యూహాత్మక నిరోధక సామర్థ్యంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.



# ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డులు

### కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు
### 1.05కోట్ల కొత్త ల్యామినేటెడ్ రేషన్ కార్డులు
### అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యం
### పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): తెలంగాణలో తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అర్హులైన 1.05 కోట్ల మంది పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజున మొత్తం 119 నియోజకవర్గాల్లో ఒకేసారి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని చెప్పారు. అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి స్వయంగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ పక్రియ మొదలవుతుంది. స్వాతంత్ర్య

మిగతా 2 లో..

### ఇరాన్, ఒమన్ మధ్య

# కుదిరిన సంధి

### హర్మూజ్ జలసంధిలో కొత్త వాణిజ్య మార్గం
### ఇరు దేశాల మధ్య కుదిరిన కీలక అంగీకారం

న్యూఢిల్లీ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): హర్మూజ్ జలసంధిలో సురక్షితమైన వాణిజ్య నౌకాయాన మార్గాన్ని ఏర్పాటు చేసే విషయంలో ఒమన్‌తో జరిపిన చర్చల్లో పురోగతి సాధించినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు ఇరు దేశాల మధ్య కీలక అంగీకారం కుదిరినట్లు ఇరాన్ విదేశాంగ శాఖ

మిగతా 12 లో..



# గోదావరి ప్రాజెక్టులకు సమాధి

### ఏపీ డైరెక్షన్‌లో నడుస్తున్న జీఆర్‌ఎంబీ
### తెలంగాణకు జై అనని రేవంత్ సీఎంగా ఉన్నారు
### జయశంకర్ ఆరాటం.. కేసీఆర్ పోరటంతోనే తెలంగాణ
### జయశంకర్ జయంతి సందర్భంగా హరీష్ రావు నివాళి



సిద్దిపేట,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజూ కూడా జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నారని విమర్శించారు. సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, జయశంకర్ సారు ఆరాటం వల్లే అని చెప్పుకొచ్చారు. గోదావరిలో

మిగతా 2 లో..

# సంపాదకీయం

## ప్రజా సమస్యలపై శ్రద్ధపెట్టని పార్లమెంటు!

పార్లమెంట్ సమావేశాలు నానాటికీ దిగజారి పోతున్నాయి. అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందరగోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృధా చేస్తున్నారు. వర్షాకాల సమావేశాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. అసలు మోడీ హయాంలో చర్చలు సాగడం లేదని అనుకుంటుంటే విపక్షం అంతకుమించి అన్నట్లుగా పార్లమెంట్ స్తంభనకే పట్టుబుడతోంది. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే గత కొన్ని ఏళ్లుగా పరిశీలన చేస్తే అసలు చర్చలు సాగడం లేదు. అర్థవంతమైన చర్చలు అస్సలు చేయడం లేదు. విపక్షలు పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి, పార్లమెంట్ బయట ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ఎన్నో అవకాశాలు ఉంటాయి. ఎన్నో రూల్స్ ఉంటాయి. వారు చర్చించాల్సన విషయాలను ఈ పద్దతిలో చర్చించడం లేదు. కేవలం రాజకీయం క ఓసం రచ్చ మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఇకపోతే స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్ష పాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరామ్ జాకడ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలకు ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది అర్థం అవుతోంది. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడడం, వారిని అనునయించడం జరిగేది. వారు ఏం కోరుకుంటున్నారో మైక్ ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చు. కానీ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన అరోపణ. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు పదేపదే అరోపిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఈ సీజన్‌లో అసలు విపక్ష సభ్యులు కూడా మాట్లాడకుండా పోడియం వద్దకు రావడం, నినాదాలు చేయడం, వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నారు. దీంతో స్పీకర్ కూడా సభను వాయిదా వేసి పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ సభకు హాజరు కావడం లేదు. విద్యార్థుల సమస్యలు కావచ్చు, ఇతర సమస్యలు కావచ్చు..ప్రధాని మాట్లాడడం లేదు. కేవలం సోషల్ మీడియా ద్వారా తన భావాలను వెల్లడిస్తున్నారు. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా అర్థం అవుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. సమావేశాల్లో అనేక అంశాలపై చర్చకు అవకాశం ఉంటుంది.కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని సభకు రావడం మర్యాద. విపక్షాలకు కూడా ఆయన సూచనలు చేయవచ్చు. కానీ మంత్రులతోనే పనికానిచ్చేద్దామంటే సరికాదు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. దీనిని గుర్తించకుంటే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారు.

## రక్షణ శాఖ బలోపేతం దిశగా అడుగులు

మొదటిపేజీ తరువాయి..

ఫ్రాన్స్‌కు పంపింది. దానికి ప్రతిస్పందనగానే ఆ దేశం ఇప్పుడు తమ పూర్తి ప్రతిపాదనను పంపింది. ఇందులో విమానాల తయారీ, సాంకేతిక పరిజ్ఞానం, స్వదేశీకరణ అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఒప్పందంలోని మొత్తం 114 రఫేల్ ఫైటర్ జెట్లలో 94 విమానాల్ని భారత్‌లోనే స్థానిక భాగస్వాములతో కలిసి తయారు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల పలు ప్రముఖ భారతీయ కంపెనీలకు పెద్ద మొత్తంలో వ్యాపార అవకాశాలు దక్కనున్నాయి. ఈ ప్రతిపాదనలో అత్యంత కీలకమైన అంశం స్థానికంగా తయారీ. ఇది మేక్ ఇన్ ఇండియాకు మరింత ఊతం అందించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒప్పందం కింద 94 రఫేల్ యుద్ధ విమానాల్ని భారత్‌లో తయారు చేయాలి. ఇక్కడ ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్, మిస్సైల్ తయారీ సంస్థ , ఇంజిన్ తయారీదారు సఫ్రాన్, రాడార్, ఎలక్ట్రానిక్స్ రంగంలోని థేల్స్ సంయుక్తంగా భారతీయ భాగస్వామ్య సంస్థలతో కలిసి పనిచేస్తాయి. ఈ ప్రాజెక్టు ద్వారా భారత పరిశ్రమలకు భారీ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా టాటా, లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీసహా పలు భారతీయ కంపెనీలకు రూ. 1.6 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి, సరఫరా వ్యాపార అవకాశాలు వస్తాయని అంచనా. ఇంకా ఈ ఒప్పందంలో భారత్ అభివృద్ధి చేసిన అస్త్ర గగనతల క్షిపణుల అనుసంధానం, అలానే స్వదేశీ పరికరాల వినియోగంపై కూడా భారత్ ప్రత్యేకంగా డిమాండ్ చేసింది. మరి ఫ్రాన్స్ పంపిన ప్రతిపాదనలో ఈ అంశాలకు సంబంధించి ఎలాంటి వివరణ ఇచ్చిందోననే విషయాన్ని భారత అధికారులు పరిశీలిస్తున్నారు.






# సువర్ణాధ్యాయం

మొదటిపేజీ తరువాయి..

బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.
దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ-10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ-10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

# ఆగస్టు 15 నుంచి కొత్త రేషన్ కార్డులు



మొదటిపేజీ తరువాయి..

దినోత్సవం రోజున మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ పంపిణీ కార్యక్రమాలు సాగుతాయి. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పంపిణీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఆర్డీవోలకు అప్పగించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ వేడుకలు జరగనున్నాయి. కార్డుల సేకరణకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదికల వద్ద మౌలిక వసతులు, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

## గోదావరి ప్రాజెక్టులకు సమాధి

మొదటిపేజీ తరువాయి..

380 టిఎంసిల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తుచేసిన హరీశ్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా,ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి, రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, ప్రభుత్వం వద్ద చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాల్లో ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా అనుమతి తీసుకోలేదని మాజీ మంత్రి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క- సారక్క ప్రాజెక్ట్‌కు హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులు కుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ÷ాఖాఖ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరమన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే విషయంలో ఏపీ సర్కార్‌తో తెలంగాణ సర్కార్ లోపాయికారి ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు.జయశంకర్ సార్ తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పూర్తిగా త్యాగం చేశారని, కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని హరీశ్ రావు తెలిపారు.
తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని, కనీసం 'జై తెలంగాణ' అని అనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మొదట అజెండాలో లేదన్నారని, ఆ తర్వాత ఢిల్లీ మీటింగ్‌లో చేర్చారని, సమావేశానికి హాజరుకామని చెప్పి వెళ్లి సంతకాలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం కోర్టులలో వేసిన పిటిషన్ల నిర్వహణ రాక అట్టర్ ఎ÷-లాప్ అయిందని, కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.

## నీట్ యూజీ పరీక్షలో పెన్ అండ్ పేపర్ విధానానికి స్వస్తి

మొదటిపేజీ తరువాయి..

తీసుకుంటామని పేర్కొంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్-యూజీ నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. పేపర్ లీక్‌లు, వ్యవస్థాగత వైఫల్యాలను తొలగించేందుకు నీట్ నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇటీవల పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. మరోవైపు, ఒకవేళ పరీక్షను కంప్యూటర్ విధానంలోకి మారిస్తే.. ఆ విషయంపై ముందే స్పష్టత ఇవ్వాలని వైద్యుల సంఘం కోరింది. కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై స్పందనను తెలియజేయాలని వైద్యుల సంఘంతోపాటు సంబంధిత పిటిషనర్లకు సుప్రీం కోర్టు సూచించింది.



## విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

న్యూఢిల్లీ,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు. ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది. 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయించుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు.

## డ్రోన్ సర్వేపై సుప్రీంకోర్టు స్టే

మొదటిపేజీ తరువాయి..

యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. తమ వాదనలు వినకుండానే సర్వే ఆదేశాలు ఇచ్చారని టీజీఐఐసీ వాదనలు వినిపించింది. అయితే, హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. ఆగస్టు 14వ తేదీ వరకు టీజీఐఐసీకి గడువు విధించింది. ఆ లోగా హైకోర్టులో సవరణ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. రాయదుర్గం సర్వే నంబర్ -83/2లోని 46 ఎకరాల భూమిని వేలం వేసే ప్రతిపాదన లేదని సుప్రీంకోర్టుకు టీజీఐఐసీ సీనియర్ న్యాయవాది తెలిపారు.

## 23,731 కోట్లతో 'గోబర్ధన్'

మొదటిపేజీ తరువాయి..

తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (అఃఉ) ఉత్పత్తి చేయనుంది. దేశీయ అఃఉ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రులు తెలిపారు. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చనుందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని మంత్రులు పేర్కొన్నారు. అస్సాంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.8,970 కోట్లతో అస్సాంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు ఆమోదించారు.

## డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు

మొదటిపేజీ తరువాయి..

నోట్గి÷ చేసే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఛార్జీలు వసూలు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ వసూలు చేయకుండా ఉన్న నిబంధనలో మార్పులు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, మౌలిక సదుపాయాల సంస్థలకు స్థిరమైన ఆదాయ మార్గాన్ని కల్పించడమే ఈ మార్పుల ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. వినియోగదారులు, చిన్న వ్యాపారులపై పెద్ద భారం పడకుండా చిన్న మొత్తంలో రుసుములు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభలో ఈ బిల్లును చర్చ లేకుండానే ఆమోదించారు. ప్రస్తుతం జఖఎ వంటి డిజిటల్ చెల్లింపు విధానాలపై ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే ప్రతిపాదిత చట్ట సవరణలతో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించే అవకాశం ఉంటుంది.

## నీట్ శిక్షణ విద్యార్థి బలవన్మరణం

మొదటిపేజీ తరువాయి..

కిందటే అక్కడకు వచ్చిన వైష్ణవి.. కుటుంబానికి దూరంగా ఉండలేకపోయింది. ఇంత దూరంలో ఉండి చదవలేనంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసిన తన బాధను చెప్పుకుంది. అయితే బిడ్డ భవిష్యత్తు బాగుండాలని భావించిన తల్లిదండ్రులు.. వైష్ణవికి సర్దిచెప్పారు. ఇంతలోనే తాను ఉంటున్న హాస్టల్ గదిలో యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారంతా హుటాహుటిన కృష్ణాజిల్లాకు చేరుకున్నారు. చదువు కోసం వెళ్లిన తమ బిడ్డ ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




**DOCUMENT LOST**

Notice is hereby given to the general public that the Original Registered Sale Deed bearing Document No. 5039/2008 dated 16-10-2008, registered in the office of the Sub-Registrar, Mahabubabad, relating to the agricultural land bearing Survey Nos. 58/E/1, 54/N/2, 57/E/2, admeasuring Ac. 3.04 Guntas, situated at Jayyaram Village, Chinnagudur Mandal, Mahabubabad District, has been lost/misplaced while travelling from Jayyaram to Chinnagudur on 23-07-2026 and could not be traced despite best efforts.

## ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి





నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6, (ప్రజాజ్యోతి) : తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ గారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రాంతీయ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆయన విలువలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ఏ.ఓ యూసుఫ్ అలీ, మల్లారెడ్డి, సీఐ లు కృష్ణ, సత్యనారాయణ, సమ్మయ్య, మల్లేష్, ఆర్.ఐ లు రామక్రిష్ణ, శ్రీపాల్, ఆర్ఎస్ఐ లు మరియు మినిస్టీరియల్ సిబ్బంది మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ గారికి ఘన నివాళులర్పించారు.

## నేరడిగొండలో త్రినేత్రనిఘా

ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు





నేరడిగొండ ఆగస్టు 06(ప్రజాజ్యోతి) : ప్రజల భద్రత, నేరాల నియంత్రణ వంటి అనేక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్, మార్కెట్ ప్రాంతం, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త సాక్షి సంతోష్ సింగ్ నేరడిగొండ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, విడిసి సర్పంచ్ ఏలేటి రవీందర్ రెడ్డి,ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్ ల దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించి పాలకవర్గంతో కలిసి ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు వలన దొంగతనాలు, గొడవలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి, మహిళలు, విద్యార్థులు, వృద్ధుల భద్రత మరింత సురక్షితంగా భావిస్తారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వీడియో ఆధారాలు దర్యాప్తుకు ఎంతో ఉపయోగపడతాయి. నేరడిగొండ వారసంతలో వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అక్కడ సీసీ కెమెరాలు ఉంటే దొంగతనాలు, పిల్లలు తప్పిపోవడం వంటి ఘటనలను నివారించవచ్చు. భద్రతా వాతావరణం ఏర్పడి వ్యాపారులు, ప్రజలు మరింత విశ్వాసంతో తమ పనులు చేసుకోగలుగుతారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నారు.


## పట్టణ ప్రగతి పేరుతో ప్రజాధనం బూడిదా!





మంచిర్యాలరూరల్ ఆగస్టు 06 (ప్రజాజ్యోతి) : ప్రజలు ఆహ్లాదంగా గడపాల్సిన పార్కు నేడు నిర్లక్ష్యానికి ప్రతీకగా మారింది.మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్‌లో గత ప్రభుత్వ హయాంలో 2023లో పట్టణ ప్రగతి నిధుల కింద సుమారు 90 లక్షల వ్యయంతో నిర్మించిన పార్కు కేవలం మూడేళ్లకే మరమ్మతుల దశకు చేరుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.పార్కులో ఎక్కడ చూసినా చెత్తాచెదారం,పెరిగిపోయిన కలుపు మొక్కలు, పగిలిన టైల్స్,బీటలు వారిన గోడలు కనిపిస్తున్నాయి.ప్రజలు సేదతీరాల్సిన ప్రదేశం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసిన అభివృద్ధి పనులు తక్కువ కాలంలోనే దెబ్బతినడం నిర్మాణ నాణ్యతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.పాత మంచిర్యాల14,15,19వ డివిజన్ల ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రధాన పార్కు ఇదే.ప్రతిరోజూ వృద్ధులు వాకింగ్ కు, యువత ఓపెన్ జిమ్ లో వ్యాయామానికి ఈ పార్కును వినియోగించేవారు.ప్రస్తుతం నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితుల కారణంగా పార్కుకు రావడానికి ప్రజలు వెనుకాడుతున్నట్లు చెబుతున్నారు."90 లక్షలు ఖర్చు చేసిన పార్కు మూడేళ్లకే ఈ పరిస్థితికి ఎందుకు చేరింది? నిర్మాణంలో నాణ్యత పాటించలేదా? లేక నిర్వహణ పూర్తిగా విస్మరించారా?" అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.పార్కు నిర్మాణ పనుల నాణ్యత, వ్యయంపై సాంకేతిక విచారణ చేపట్టాలని,నిర్లక్ష్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అంతేకాకుండా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్ వెంటనే స్పందించి పార్కును శుభ్రపరచి,దెబ్బతిన్న సౌకర్యాలను మరమ్మతు చేసి ప్రజలకు తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## పీజీ ప్రవేశ పరీక్షల్లో స్టేట్ రెండో ర్యాంక్ సాధించిన బాదంపెల్లి వాసి



జన్నారం, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి) : కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్షల్లో సోషియాలజీ సబ్జెక్టులో జన్నారం మండలం బాదంపెల్లి గ్రామానికి చెందిన ఎనగందుల సౌమ్యశ్రీ రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించారు.సౌమ్య శ్రీ మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో చదువుకొని 10వ తరగతి ఫలితాల్లో 10 జీపీఏ, ఇంటర్మీడియేట్ కరీంనగర్ ట్రినిటీ కళాశాలలో చదువుకొని 97శాతం,డిగ్రీ సెయింట్ ఫ్రాన్సిస్ హైదరాబాద్ లో పూర్తి చేశారు. భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్ అధికారిగా సేవలందించడమే లక్ష్యమని అన్నారు. రాష్ట్ర స్థాయి రెండవ ర్యాంకు సాధించిన సౌమ్యశ్రీని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మండల వాసులు అభినందించారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

- ఆజన్మాంతం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి
- తెలంగాణ జాతి హితం కోసం ఎన్నో రచనలు చేసి మహా మేధావి
- జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్





నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6, (ప్రజాజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు. మొదటగా అధికారులతో కలిసి ప్రొఫెసర్ జయశం కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ జయంతి వేడుకలలో భాగంగా ఆయన మాట్లాడుతూ, ఆజన్మాంతం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని ఉద్యోగులు, మేధావులు, కళాకారులకు, తెలంగాణ ప్రజానీకానికి తెలియజెప్పి, స్వరాష్ట్ర ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారని అన్నారు. ఆనాటి కాలంలో తెలంగాణలోని సబ్బండ వర్గాలను ఏకం చేసి తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ముందుండి నడిపించారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ కలలుగన్న తెలంగాణ రాష్ట్రాన్ని అధికారులు సమిష్టి కృషితో అభివృద్ధి చేసినప్పుడు ఆయనకి ఘనమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు.

తెలంగాణ జాతి హితం కోసం ఎన్నో రచనలు చేశారని గుర్తు చేశారు. ఇలాంటి మేధావుల జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. నేటి తరం వారికి ప్రొఫెసర్ జయశంకర్ గొప్పతనాన్ని తెలియజేయాలని తెలిపారు. ఆచార్య జయశంకర్ ఆలోచనలు మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు.

ఈ జయంతి వేడుకలలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సి కార్పొరేషన్ శంకర్, డిఈఓ భోజన్న, జిల్లా ఖజానా అధికారి సరోజ, ఎల్డిఎం రామ్ గోపాల్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 'వాగ్దారిలో పోలీసులు - మీ కోసం' కార్యక్రమం

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ క్షేత్రస్థాయి పర్యటన



నేరడిగొండ, ఆగస్టు 06 (ప్రజా జ్యోతి) : నేరడిగొండ మండలంలో నేడు (శుక్రవారం, ఆగస్టు 07) "పోలీసులు - మీ కోసం" పేరిట నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వాగ్దరి గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నారు. ఈ పర్యటనను పురస్కరించుకుని ప్రజల సంక్షేమం, అవగాహన కోసం పలు విశేష కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**ప్రధాన కార్యక్రమాలు :** - పోలీస్ మెగా ఉచిత హెల్త్ క్యాంప్: ఉచిత వైద్య పరీక్షలు మరియు మందుల పంపిణీ. - మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్: యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు. - విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు: పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక పోటీలు. - పబ్లిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్: సైబర్ నేరాలు, చట్టాలపై ప్రజలకు ముఖాముఖి అవగాహన.

కార్యక్రమ వివరాలు:

- తేదీ: 07-08-2026 (శుక్రవారం)
- స్థలం: వాగ్దరి గ్రామం, నేరడిగొండ మండలం

ఈ కార్యక్రమానికి మండల ప్రజలందరూ విశేషంగా హాజరై ఉచిత సేవలని వినియోగించుకోవాలని మరియు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై వార్తను విస్తృతంగా ప్రచారం చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- ఆచార్య జయశంకర్ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్, ఆగస్టు 6 ప్రజాజ్యోతి : తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించి, మలిదశ ఉద్యమంలో ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. ఆగస్టు 6 గురువారం నాడు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి. అహ్మద్, పీఏసీఎస్ ప్రతినిధి అలీబిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగలతో కలిసి కలెక్టర్ హాజరై, జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో జయశంకర్ సర్ పాత్ర మరవలేనిదని, మహనీయుల ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు.

ఈ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, బిసి సంక్షేమ శాఖ అధికారి నదీమ్, గిరిజనాభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డిఆర్‌డిఓ దత్తారావుతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు యువతకు ఆదర్శం

- ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. పాండురంగ శర్మ
- తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఘనంగా జయంతి వేడుకలు





మంచిర్యాల, 6, ఆగస్టు (ప్రజా జ్యోతి): ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని విద్య, సమాజ సేవ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కృషి చేయాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. పాండురంగ శర్మ అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1934 ఆగస్టు 6న జన్మించిన ప్రొఫెసర్ జయశంకర్ సత్యం, న్యాయం, సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. విద్య ద్వారానే చైతన్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమనే నమ్మకంతో యువతలో జ్ఞానం, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు జీవితాంతం కృషి చేశారని తెలిపారు. గొప్ప విద్యావేత్తగా, కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవకు అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజల్లో చైతన్యం కల్పించడంలో ఆయన పరిశోధనలు, రచనలు, శాంతియుత ప్రజాస్వామ్య విధానం కీలక పాత్ర పోషించాయని, తెలంగాణ సామాజిక, విద్యా, సాంస్కృతిక చరిత్రలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జీవితం విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని, న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం, సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వహీదా, హిస్టరీ విభాగాధిపతి ఎస్. సత్యరాణి, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం. జ్యోతి, ఎకనామిక్స్ అధ్యాపకురాలు బి. నికిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్

- సీపీ అంబర్ కిషోర్ ఝా
- కమిషనరేట్ పోలీస్ కార్యాలయంలో ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలు





మంచిర్యాల, 6, ఆగస్టు (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు డీసీపీ, అధికారులు, పోలీసు సిబ్బంది చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, తెలంగాణ సిద్ధాంత కర్తగా ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనకే అంకితం చేశారని కొనియాడారు. 1969 తెలంగాణ ఉద్యమం, నాన్ ముల్కీ ఉద్యమం, "ఇడ్లీ-సాంబార్ గో బ్యాక్" ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమం వంటి పలు ఉద్యమాల్లో పాల్గొని, దేశవ్యాప్తంగా వివిధ వేదికలపై తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించారని అన్నారు. ఆరు దశాబ్దాలపాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పి, ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యపరిచిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రా యం, స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పోలీసు శాఖ ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు దామోదర్, రమేష్, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పుణ్యస్నాన ఘాట్‌లో సమస్యలే స్వాగతం!



మంచిర్యాల రూరల్ ఆగస్టు06(ప్రజాజ్యోతి) : భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సదుపాయాలే ప్రస్తుతం ఇబ్బందులకు కారణమవుతున్నాయి. మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డుకు సమీపంలోని గోదావరి పుణ్యస్నాన ఘాట్‌లో నీటి పంపులకు అమర్చిన ఆన్-ఆఫ్ పరికరాలు పనిచేయక పోవడంతో రోజంతా నీరు నిరంతరం వృథాగా పారుతోంది. వృథాగా పారుతున్న నీరు ఘాట్ పరిసరాల్లో నిల్వ ఉండటంతో పాకురు,బురద పేరుకుపోయి జారుడు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.ఘాట్ వద్ద స్నానం చేయలేక చాలామంది నేరుగా గోదావరి నదిలోకి దిగుతున్నారు.వృద్ధులు, మహిళలు, చిన్నారులు జారిపడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.ప్రతిరోజూ వందలాది మంది భక్తులు వచ్చే ఈఘాట్‌లో చిన్న లోపాన్ని సరిచేయడంలో కార్పొరేషన్ ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.నీటి వృథా ఒకవైపు,భక్తుల భద్రత మరోవైపు ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు అంటున్నారు.ఇప్పటికైనా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ తో పాటుగా ఇరిగేషన్ శాఖ డీఈ వెంటనే స్పందించి నీటి పంపులకు ఆన్-ఆఫ్ పరికరాలు అమర్చి, ఘాట్‌ను పరిశుభ్రంగా మార్చి,భక్తుల భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని భక్తులు,స్థానికులు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లపై నిర్లక్ష్యం ఎందుకు

మండల ప్రత్యేక సమావేశంలో అబ్దుల్లాపూర్ సర్పంచ్ ఆగ్రహం



లోకేశ్వరం జులై 6 (ప్రజా జ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంపై అధికారులు నిర్లక్ష్యంతో లబ్ధిదారుల ఆశలకు అధికారులు గండి కొడుతున్నారని అబ్దుల్లాపూర్ సర్పంచ్ దడిగే జయలలిత ఆరోపించారు గురువారం రోజున మండల ప్రత్యేక సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పలువురు సర్పంచులు అధికారుల తీరుపై మండిపడ్డారు చేసిన పనులకు బిల్లు చెల్లింపులపై అలసత్వం వహిస్తున్నారని మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు భుజంగరావు ఆరోపించారు స్థానిక సర్పంచ్లకు సమాచారం లేకుండానే దొంగ చాటున కొన్ని పనులు జరుగుతున్నాయని నా గ్రామంలో రిటైర్డ్ ఉద్యోగి భార్యకు ఇల్లు మంజూరు కావడం తమకు తెలియకుండానే ఎలా జరుగుతుందని ఎంపీడీవో రామకృష్ణపై మండిపడ్డారు చేసిన పనులకు బిల్లులు సైతం వెంటనే ఇవ్వకపోతే రాబోయే రోజుల్లో పనులు చేయడం తమతో కాదని సర్పంచ్ల సంఘం ముక్తకంఠంతో తెలిపారు రాబోయే రోజులలో జరిగే మండల ప్రత్యేక సమావేశం నాటికి ఎటువంటి పనులు పెండింగ్ ఉండకుండా పూర్తిస్థాయి నివేదికతో రావాలని సర్పంచ్ల సంఘం పేర్కొన్నారు ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి దయానంద్ ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు తాసిల్దార్ సూర్యారావు ఎంఈఓ చంద్రకాంత్ మండల వ్యవసాయ అధికారి గిరిరాజ్ ఎంపీ ఓ సాల్మన్ రాజ్ పంచాయతీ రాజ్ ఆర్డబ్ల్యూఎస్ రోడ్డు భవనాల శాఖ ఇరిగేషన్ ఆయా శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు



జన్నారం,ఆగస్టు6(ప్రజాజ్యోతి) : ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను గురువారం రోజున అఖిల భారత విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఆచార్య జయశంకర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్ మాట్లాడుతూ తొలి దశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచి, బంగారు తెలంగాణ స్ఫూర్తి ప్రదాత తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేయిగండ్ల రవి, ప్రధాన కార్యదర్శి బండోజు లక్ష్మీనరసయ్య, కోశాధికారి అగ్రో నరసయ్య, గౌరవ అధ్యక్షులు యశోద గురువయ్య, నాయకులు కట్ట వెంకటేష్,మందపల్లి వీరాచారి, అజయ్, చందు, ఉప్పుల శ్రీను పాల్గొన్నారు

## ఆచార్య జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్





మంచిర్యాల, 6, ఆగస్టు (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అంకితభావంతో పోరాడిన మహా నీయుడు, గొప్ప విద్యావేత్త, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కొనియాడారు. ఆచార్య జయ శంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, దశాబ్దాల పాటు తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను సాకారం చేయడానికి ఆచార్య జయశంకర్ జీవితాన్నే అంకితం చేశారని అన్నారు. విద్య, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో సమాజాభివృద్ధి సాధ్యమనే సందేశాన్ని ఆయన తన జీవితంతోనే చాటిచెప్పారని పేర్కొన్నారు. తొలి దశ, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో గణాంకాలతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించి, రాష్ట్ర సాధన కోసం ప్రజలను ఏకం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అలాంటి మహనీయుడి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం జీఎం కార్యాలయంలోని అన్ని విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కృష్ణ ప్రసాద్, గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మోతుకూరి కొమురయ్య, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, ఏరియా పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏరియా సర్వేయర్ నర్సింగరావు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, డిప్యూటీ పీఎంలు క్రాంతి కుమార్, కిరణ్, సీనియర్ పీఓ ప్రశాంత్, పిట్ సెక్రటరీ సందీప్‌తో పాటు జీఎం కార్యాలయానికి చెందిన ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలే తెలంగాణకు మార్గదర్శి

- ప్రతి ఒక్కరూ ఆశయసాధనకు కృషి చేయాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి): ప్రత్యేక తెలంగాణ సాధనలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృ



ద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్‌తో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన కోసం జయశంకర్ జీవితాంతం చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ఆయన కలల సాకారమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంధం నాగరాజు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి

- తెలంగాణ సాధనకు ఆయన సేవలు చిరస్మరణీయం: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కొనియాడారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం





మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని శాస్త్రీయంగా, చారిత్రకంగా దేశానికి చాటిచెప్పి ఉద్యమానికి భావజాలాన్ని అందించిన గొప్ప విద్యావేత్త, మేధావి, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా ఆచార్య జయశంకర్ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో ఆయన చేసిన సేవలు, త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజ అభ్యున్నతి, ప్రాంతీయ సమాన అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం పాటుపడ్డారని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

# స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆగస్టు 15 వేడుకలను ఘనంగా నిర్వహించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

కలం, వనపర్తి: ఆగస్టు 15న నిర్వహించే దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ మైదానంలో జరిగే ప్రధాన వేడుకలకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారులు, ఆహ్వానితులకు ఆహ్వానాలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు.



వేదిక ఏర్పాట్లు, అతిథులకు అవసరమైన సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. పోలీసు గౌరవ వందనం, బందోబస్తు ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించాలని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే విధంగా వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పీ సీఈవో యాదయ్య, సీపీఓ హరికృష్ణ, ఆర్డీవో సుబ్రహ్మణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

# "అనీమియాపై అప్రమత్తం... గర్భిణులకు మెరుగైన వైద్యం"

- మాతా–శిశు ఆరోగ్యంపై కలెక్టర్ ఫోకస్
- గోపాలపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి): జిల్లాలో ప్రతి గర్భిణికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తహీనత (అనీమియా)తో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం గోపాలపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన లేబర్‌రూమ్, ఓపీ విభాగం, ఈడీడీ రిజిస్టర్‌ను పరిశీలించారు. రాబోయే నెలల్లో ప్రసవించనున్న గర్భిణుల వివరాలు, వారికి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, రక్తహీనత సమస్య ఉన్న మహిళల పరిస్థితిపై ఆరా తీశారు. అనీమియాతో బాధపడుతున్న గర్భిణులను వెంటనే గుర్తించి పోషకాహారం, అవసరమైన మందులు అందించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాతా–శిశు ఆరోగ్యానికి



సంబంధించిన వివరాలను ఎంసీహెచ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. పరీక్షల కోసం వచ్చిన ఓ గర్భిణితో నేరుగా మాట్లాడిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీపై వివరాలు తెలుసుకున్నారు. రోజువారీ ఓపీ నమోదును పరిశీలించి, చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించాలని, అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లేబర్‌రూమ్‌లకు అవసరమైన మౌలిక వసతులు, పరికరాలపై ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి, ఆర్‌టీఐ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, ఆగస్టు 6( ప్రజా జ్యోతి బ్యూరో ): కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, ప్రజావాణి వినతులు, ఆర్‌టీఐ దరఖాస్తులు, కోర్టు కేసుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా సకాలంలో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కార్యాలయ





సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు కీలక సూచనలు చేశారు. ప్రతి ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలను నిబంధనలకు అనుగుణంగా పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఫైళ్లను పరిశీలించే సమయంలో సంబంధిత చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు, నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి స్పష్టమైన అభిప్రాయంతో సమర్పించాలని తెలిపారు. సందేహాలు ఉంటే సంబంధిత అధికారులతో లేదా తనతో చర్చించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉద్యోగులు కార్యాలయ సమయాలను కచ్చితంగా పాటిస్తూ బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని స్పష్టం చేసిన కలెక్టర్, కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి తన శాఖకు సంబంధించిన తాజా చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు, మార్గదర్శకాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని, అధికారులు–సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పాత దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా కొత్త ఫైళ్లను ముందుగా పరిష్కరించడం సరికాదని పేర్కొన్న ఆమె, ముందుగా వచ్చిన దరఖాస్తులకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పెండింగ్ ఫైళ్లను స్వయంగా గుర్తించి పరిష్కారానికి చొరవ చూపే ఉద్యోగులను తాను గమనిస్తున్నానని తెలిపారు. కలెక్టరేట్‌కు ఉద్యోగులే వెన్నెముక అని, వారి పనితీరుపైనే కార్యాలయ ప్రతిష్ఠ ఆధారపడి ఉంటుందని అన్నారు.


**ప్రజావాణి, ఆర్‌టీఐ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి:**


ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించి దరఖాస్తుదారులకు త్వరితగతిన సమాధానం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్లు లేదా ఇతర శాఖలకు పంపాల్సిన వినతులను వెంటనే ఫార్వర్డ్ చేయాలని, ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారంలో కూడా ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతివాదిగా ఉన్న కోర్టు కేసుల్లో సంబంధిత శాఖలు వెంటనే కౌంటర్లు దాఖలు చేసి వాటి ప్రతులను సంబంధిత సెక్షన్‌కు అందజేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌ను ఏదైనా కేసులో పార్టీగా చేర్చిన వెంటనే పరిపాలన అధికారికి సమాచారం ఇవ్వాలని, కోర్టులో దాఖలు చేసిన అన్ని పత్రాల ప్రతులను సంబంధిత విభాగంలో రికార్డుగా భద్రపరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, పరిపాలన అధికారి సువర్ణ రాజు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రత అందరి బాధ్యత

- మానవ అక్రమ రవాణాపై సమాజమంతా అప్రమత్తం కావాలి
- బాధితులు వెంటనే హెల్ప్‌లైన్‌లను ఆశ్రయించాలి
- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి): మహిళలు, చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు





సమాజంలోని అన్ని వర్గాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి పిలుపునిచ్చారు. గురువారం వనపర్తి జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి మహిళా సాధికారత కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీ సీఈవో యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా వల్ల మహిళలు, బాలికలు, చిన్నారులు ఎదుర్కొనే ప్రమాదాలు, రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. ఉద్యోగాలు, విదేశీ ఉపాధి, విద్య పేరుతో తప్పుడు హామీలు ఇచ్చి మోసం చేయడం, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని వల వేయడం, నకిలీ వివాహాలు, చిన్నారులను ప్రలోభపెట్టడం లేదా అపహరించడం వంటి మార్గాల ద్వారా అక్రమ రవాణా జరుగుతోందని వివరించారు. ఇలాంటి ముఠాల బారిన పడితే వ్యక్తిగత స్వేచ్ఛ కోల్పోవడం, శారీరక–మానసిక హింసకు గురికావడం, చదువు, భవిష్యత్తు దెబ్బతినడం, కుటుంబాలకు దూరమవడం వంటి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దని, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. అనంతరం అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మోసపు ఉచ్చులో చిక్కుకున్న బాధితులు అత్యవసర సహాయం కోసం 112 (పోలీసు అత్యవసర సేవలు), 181 (మహిళల హెల్ప్‌లైన్), 1098 (బాలల హెల్ప్‌లైన్) నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్, హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ఐ అమ్జద్, జీసీడీఓ, ఏఎస్ఓ, సీడీపీఓలు, ఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, డీహెచ్‌ఈడబ్ల్యూ స్టాఫ్, సఖి టీమ్, షీ టీమ్, భరోసా టీమ్, ఐసీపీఎస్ టీమ్, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ప్రొఫెసర్ జయశంకర్: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఘనంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు

గద్వాల ఆగస్టు 06(ప్రజా జ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ





సందర్భంగా వారు మాట్లాడుతూ,తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే శ్వాసగా,జీవిత లక్ష్యంగా భావించి చివరి వరకు ఉద్యమం కోసం కృషి చేసిన గొప్ప యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు.ఉద్యమ నాయకుడిగానే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ రాష్ట్ర భవిష్యత్ దిశను సైద్ధాంతికంగా నిర్దేశించిన మహామేధావిగా ఆయన చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమానికి ఆయన రచనలు,ఉపన్యాసాలు,పరిశోధనలు మేధోబలంతో పాటు స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని అందించాయని తెలిపారు.విద్యారంగంలో ఆయన చేసిన సేవలు,సమానత్వం,ప్రాంతీయ న్యాయం,సామాజిక అభివృద్ధిపై చేసిన అధ్యయనాలు నేటి యువతకు,విద్యార్థులకు ఆదర్శప్రాయమని అన్నారు.తెలంగాణ హక్కుల సాధన కోసం జీవితాంతం నిరంతరం పోరాడిన మహనీయులలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఒకరుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,ఆర్డీవో శ్రీనివాసరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్‌కుమార్,కలెక్టరేట్ ఏవో మంజుల,పలువురు జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేసి వనమహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి:కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

- పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు అధికారులకు ఆదేశాలు

గద్వాల ఆగస్టు 06(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు,ప్రహరీ గోడలు,మరమ్మత్తులు తదితర అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.వివిధ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు,ప్రహరీ గోడలు,మరమ్మత్తుల పనుల పురోగతిని మండలాల వారీగా





సమీక్షించారు.పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినప్పటికీ,పనులను సకాలంలో పూర్తి చేయడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు.నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు,పంట కుంటల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.అలాగే కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం,ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ (ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్)పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.వనమహోత్సవం లక్ష్యాలను పూర్తిచేసే దిశగా ప్రస్తుతం అనుకూల వాతావరణం ఉన్నందున విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. త్వరలో మండల స్థాయిలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్,డీఈ లక్ష్మణ్,వివిధ మండలాల ఎంపీడీవోలు,ఎంపీవోలు,ఎంఈవోలు,పీఆర్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలి

• జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 06 (ప్రజాజ్యోతి) :** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రొఫెసర్ కొత్తపల్లి జయ శంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలు, భావజాలం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. అదే విధంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోం, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అధికారులు అందరూ హాజరై, జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఎన్.ఎల్. నరసింహ రావు, వైటిడిఎ సభ్యులు లక్ష్మి నారయణ నాయక్, సీనియర్ పాత్రికేయులు కన్నా పరశురాములు, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రామేశ్వర చారి, ఆరే కుల క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షులు లింగాజి, జిల్లా బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి హరీష్, బిసి సంక్షేమ సంఘం మహిళా అద్యక్షులు గంగ భవాని , ఇతర కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ఐడిఒసి సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ సిద్ధాంతకర్త ఉద్యమ స్ఫూర్తి కొత్త పెల్లి జయశంకర్ జయంతి వేడుకలు

మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి



**రాయపర్తి ఆగస్టు 6 ప్రజా జ్యోతి :** నాలుగు కోట్ల ప్రజలలో తెలంగాణ ప్రజలలో ఉద్యమ స్పూర్తిని రగిలించిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు వరంగల్ జిల్లా 'రాయపర్తి' మండల కేంద్రంలోని బీ ఆర్ ఎస్ మండల పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి మాట్లాడుతూ నాలుగు కోట్ల ప్రజలలో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన తెలంగాణ సిద్ధాంతకర్త తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగావారి చిత్రపటానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పూలమాల వేసి ఘన నివాళు అర్పించినారు. ఈ సందర్భంగా జయశంకర్ సార్ ఉద్యమ చైతన్యాన్ని, స్ఫూర్తిని. స్మరించుకున్నారు . ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మాజీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, ఐత రామ్ చందర్, చిన్నల ఉప్పలయ్య, చందు రామ్, పెద్దగోళ్ళ రాజు, సంకినేని ఎల్లస్వామి, చిర్ర శ్రీనివాస్, ఐత రవి, సకినాల రామన్న, తెరల సదానందం, చిర్ర విష్ణు, రమాకాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ సార్‌కు ఘన నివాళి

నివాళులర్పించిన మున్సిపల్ ఛైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్



**పరకాల, ఆగస్టు 06, (ప్రజా జ్యోతి):** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి భావజాలాన్ని అందించి కోట్లాది ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని పరకాల క్యాంప్ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళు లర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒంటేరు శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనకు జయశంకర్ సార్ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోలేపాక చందు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నీకు దివ్య విద్యాసాగర్, కౌన్సిలర్లు కొయ్యాడ శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి జాఫర్ రిజ్వి, సమన్వయ కమిటీ సభ్యులు మేరుగు శ్రీశైలం, చందపట్ల రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు బొమ్మకంటి చంద్రమౌళి, బొచ్చు సల్మాన్, లక్కం వసంత, పంచగిరి హరి, గడ్డం శివకుమార్, పసుల భద్రయ్య, ఒంటేరు వరుణ్, బొచ్చు రాజు, జూపాక కిషన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆచార్య జయశంకర్‌కు ఘన నివాళి

- ఏకశిలా పార్కులో విగ్రహానికి పూలమాలలు వేసిన ఇన్‌చార్జి కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6, (ప్రజా జ్యోతి):** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని హనుమకొండలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఏకశిలా పార్కులోని ఆయన విగ్రహానికి హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శేషాద్రి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ సీహెచ్‌వో లక్ష్మారెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, వాకర్స్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15న ములుగు జిల్లాకు రానున్న సిఎం రేవంత్ రెడ్డి





- 16న ములుగు జిల్లా కలెక్టరేట్ ను ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి
- సిఎం పర్యటనకు ముందు ములుగు జిల్లాలో పర్యటించనున్న డిజిపి

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 16న ములుగు జిల్లాకు రానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 15వ తేదీ సాయంత్రం మేడారం చేరుకొని, రాత్రి అక్కడే బస చేసి..మరుసటి రోజు ఉదయం వనదేవతల సన్నిధిలో పూజలు నిర్వహించి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకోనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ములుగు జిల్లా కేంద్రంలో నిర్మాణం పూర్తి చేసుకున్న జిల్లా సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం (నూతన కలెక్టరేట్ భవనం),ములుగు మండలంలోని ఇంచర్ల సమీపంలో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ములుగు శివా రులోని గట్టమ్మ సమీపంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వ ర్యంలో నిర్మించిన హ్యామ్ రోడ్ల పైలాన్‌ను సైతం ఆవిష్కరించను న్నారు. ములుగులో వాటితో పాటు పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయ భవనం, తాడ్వాయి మండలం మేడారంలో ఆర్అండ్ బి అతిథి గృహం, ములుగు మండలంలోని పొట్లాపూర్ ఎత్తిపోతల పథకం, మంగపేటలో పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. తహసీల్దార్, ఐటిడిఏ ఏటూరు నాగారంలో భవనం, మల్లంపల్లిలో తహశీల్దార్,ఎంపిడిఓ, ములుగులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలు, హ్యామ్ పథకంలో మంజూరైన మంగపేట-మణుగూరు, బ్రాహ్మణపల్లి - కాటాపూర్ రోడ్ల పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు. హ్యామ్ పైలాన్ మినహా మిగిలినవి అన్నీ నూతన కలెక్టరేట్ ఆవరణలోనే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన శిలాఫలకాలను సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. కాగా అందుకు సంబంధించిన పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన దృష్ట్యా ములుగు జిల్లాలో డిజిపి సివి ఆనంద్ పర్యటన ఉంటుందని,సిఎం పర్యటనకు ముందే ఉంటుందని విశ్వసనీయ సమాచారం.

## ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త







- ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహ దేవరావు

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :**
ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త అని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించు కుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ జీవిత చరిత్ర సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా ఉన్నతాధికారులు స్మరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ జయంతిని రాష్ట్ర పండుగ లాగా నిర్వహిస్తున్నామని,ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ కు తెలుగు,ఉర్దూ, హిందీ,ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసారని,రాష్ట్ర అభివృద్ధి కొరకు మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని, ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ.సంపత్ రావు, డిఆర్ఓ రవికుమార్,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషిల్ వంశీ,డిపిఆర్ఓ రఫిక్, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, సూపరిండెంట్లు మహేష్ బాబు,మంజుల, శివకుమార్, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

## ఆచార్య జయశంకర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం





- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్.రవి

**హనుమకొండ జిల్లా ప్రతినిధి: ఆగస్టు 6, (ప్రజా జ్యోతి) :** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆలోచనలు, ఆశయాలు స్ఫూర్తిదాయకం అని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊదారని, ప్రొఫెసర్ జయశంకర్ అధికారికంగా నిర్వహించు కుంటున్నామని తెలిపారు. ఉద్యమాల వెనుక మేధావుల పాత్ర ప్రధానంగా ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఎన్నో ఉద్యమాలలో ఉపాధ్యాయులు పాత్ర, సైద్ధాంతిక మార్గదర్శకం ద్వారా విజయవంతం అయ్యాయని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విలీనం అయిన తర్వాత తెలంగాణ ప్రాంత వెనుకబాటుతనాన్ని 1952లోనే గుర్తించి 1969 లో వచ్చిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో, మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆచార్య జయశంకర్ క్రియాశీలక పాత్రను పోషించారని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి శ్వాసగా నిలిచి, తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకోవడంలో ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు మనకెంతో స్ఫూర్తిదాయకమన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ఉద్యోగులు మరింత కష్టపడి పనిచేయాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయం, తదితర అంశాల్లో మిగతా రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు చేయూతనందిస్తూ ఆచార్య జయశంకర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు ముఖ్యపాత్ర వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాతి పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనే నిజమైన నివాళి







- జయశంకర్ స్వగ్రామంలో ఘనంగా జయంతి వేడుకలు
- తహసీల్దార్, అక్కంపేట సర్పంచ్ ఆధ్వర్యంలో నివాళులు

**ఆత్మకూరు, ఆగష్టు 06 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర సాధన సిద్ధాంతకర్త, తెలంగాణ జాతి పితామహుడు, దివంగత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92 వ జయంతి వేడుకలను ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి, అక్కంపేట గ్రామ సర్పంచ్ ముద్దం సాంబయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలు, తెలంగాణ ఉద్యమంలో పోషించిన కీలక పాత్రను స్మరించు కుంటూ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక ప్రొఫెసర్ జయశంకర్ చేసిన మేధోపరమైన కృషి, త్యాగం, అంకితభావం ఎన్నటికీ మరువలేనివని అన్నారు. ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం, ప్రజల్లో చైతన్యం నింపిన ప్రసంగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు.

అక్కంపేట గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన కలలు కన్న సమాన అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జయశంకర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్న సీఐ సంతోష్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వమే ప్రత్యేక రాష్ట్ర సాధనకు బలమైన పునాదిగా నిలిచిందన్నారు. ఆయన ఆలోచనలు, విలువలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, స్థానిక నాయకులు, యువత, గ్రామస్తులు జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ మహాధర్నా విజయవంతం..



**పరకాల, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి) :** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహాధర్నా విజయవంతంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఈ మహాధర్నాలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి జస్వంత్, అధ్యక్షుడు సాయికుమార్, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు ఇస్మాయిల్, సాయితేజ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## తోగురు మల్లయ్య మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

- మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి



**రాయపర్తి ఆగస్టు 6 ప్రజా జ్యోతి :** తోగురు మల్లయ్య మృతి బి ఆర్ ఎస్ పార్టీకి తీరని లోటు అని మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి అన్నారు. గురువారంవరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామంలో.బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తోగురు ఐలయ్య అనారోగ్యంతో మరణించగా, రాష్ట్ర మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మాజీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి స్థానిక నాయకులు అయిన మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు బొమ్మెర వీరాస్వామి,మాజీ సర్పంచ్ చిన్నల రాజబాబు, మాజీ ఎంపీటీసీ బండి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో ప్రొ.జయశంకర్ జయంతి వేడుకలు



**భూపాలపల్లి టౌన్, ప్రజాజ్యోతి, ఆగస్టు 6 :** ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సందర్భంగా భూపాలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ప్రొ.జయశంకర్ చిత్రపటానికి తహశీల్దార్ లక్ష్మీరాజయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా, అంతకుముందు జరిగిన నాన్-ముల్కీ ఉద్యమంలో కూడా ఆయన చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తన కళ్లారా చూడాలని తరచూ చెప్పేవారని, అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ముందే 2011 జూన్ 21న ఆయన మరణించడం తెలంగాణ ప్రజలకు తీరని లోటని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జ్ఞాపకార్థం మన జిల్లాకు ఆయన పేరు పెట్టడం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమని తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అంజలి రెడ్డి, గిర్దావర్ రామస్వామి, జీపీఓలు. బండి శ్రీనివాస్, జితేందర్, కిరణ్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాయపర్తిలో ఆగస్టు 16న ముత్యాలమ్మ, మారెమ్మ బోనాలు నిర్వహించాలి

- గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి

**రాయపర్తి ఆగస్టు 6 ప్రజా జ్యోతి :** రాయపర్తి మండల కేంద్రంలో బోనాల పండుగ పర్వదినాన్ని ఆగస్టు 16న నిర్వహించాలని గ్రామ సభ తీర్మానించిందని రాయపర్తి గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో ఆగస్టు 16, ఆదివారం రోజున అన్ని కులాల ప్రజలు సంప్రదాయబద్ధంగా శ్రీ ముత్యాలమ్మ, శ్రీ మారెమ్మ బోనాలు నిర్వహించాలని గ్రామపంచాయతీ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ మరియు గ్రామ పెద్దలు శ్రీ సహేంద్ర బిక్షపతి, శ్రీ మచ్చ రమేష్ గ్రామ ప్రజానీకానికి విజ్ఞప్తి

## పాల్వాయి బిక్షం మృతికి దైద రవీందర్ సంతాపం

నకరికల్ ఆగస్టు 6 ప్రజా జ్యోతి:
నకిరేకల్: నియోజకవర్గ కేంద్రంలోని వడ్డెరబస్తీకి చెందిన పాల్వాయి బిక్షం (కోర్టు బిక్షం)



అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):
నకిరేకల్ పట్టణంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం పలు కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పట్టణానికి చెందిన



పాల్వాయి బిక్షమయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే 8వ వార్డుకు చెందిన కనుకుంట్ల చంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. 7వ వార్డుకు చెందిన పెండెం సత్తయ్య కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం అనారోగ్యంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న సిరికొండ యాదమ్మను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## మదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎస్ఐ నరేష్

### గ్రీన్‌వుడ్ పాఠశాలలో కేనైన్ (డాగ్ స్క్వాడ్)తో తనిఖీలు

హుజూర్‌నగర్, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):
మదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హుజూర్‌నగర్ ఎస్ఐ నరేష్ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆదేశాల మేరకు గురువారం





హుజూర్నగర్‌లోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో ప్రత్యేక కేనైన్ (డాగ్ స్క్వాడ్) బృందంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాగ్ స్క్వాడ్ సహాయంతో తరగతి గదులు, విద్యార్థుల బ్యాగులు, పాఠశాల ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో ఎలాంటి మాదక ద్రవ్యాలు లేదా అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ, యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీసులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే 1908 తెలపని లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తుమ్మ సరిత మరెడ్డి ప్రిన్సిపల్స్ రాజారెడ్డి,కృష్ణారావు ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, కేనైన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి-65 వెంట బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ కొనసాగించాలి

నకిరేకల్, ఆగస్టు 6: ప్రజా జ్యోతి:
శంషాబాద్–చెన్నై బుల్లెట్ ట్రైన్ మొదటి అలైన్‌మెంట్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ నేషనల్ హైవే–65 సమాంతర బుల్లెట్ ట్రైన్ సాధన సమితి నకిరేకల్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి–65 వెంట ప్రతిపాదించిన మార్గం కొనసాగితే నకిరేకల్, నల్గొండ, సూర్యాపేట ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. మొదటి అలైన్‌మెంట్‌లో శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ, డ్రైపోర్ట్, బాటసింగారం, చౌటుప్పల్, చిట్యాల, నార్కెట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ మీదుగా చెన్నైకి మార్గం ఉండేదని తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, ఎంపీల దృష్టికి తీసుకెళ్లి మొదటి అలైన్‌మెంట్‌నే అమలు చేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశంను కోరారు.



## తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆచార్య జయశంకర్ సార్

మిర్యాలగూడ, ఆగస్టు 06,( ప్రజాజ్యోతి ):
తెలంగాణ ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి



చెప్పిన మహనీయులు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ ఒకరని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ )అన్నారు. గురువారం జయశంకర్ 92వ జయంతి సందర్భంగామిర్యాలగూడ పట్టణంలోనివిశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఉన్న



ఆచార్య జయశంకర్ సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విశ్వకర్మ సంఘం ప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ సార్ జీవితాంతం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికిచాటిచెప్పిన మహనీయుల్లో జయశంకర్ సార్ ఒకరని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన అందించినమేధోపరమైన మార్గదర్శకత్వం, ఉద్యమానికి అందించిన స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగానిలుస్తాయని పేర్కొన్నారు.జయశంకర్ సార్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మార్గంలోని యువతపయనించాలని కోరారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీరావత్ స్కైలాబ్ నాయక్, చిలుకూరి బాలు, గుడిపాటి నవీన్, కోడి రెక్క ఇంద్ర కుమార్, మోయిజ్,ప్రజాప్రతినిధులు, విశ్వకర్మ సంఘం నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సీఈసీ మొదటి సంవత్సరం రాష్ట్ర టాపర్ సాయిధకు ఓయూ విద్యార్థి నాయకుల ఘన సన్మానం

### ఐఏఎస్ లక్ష్యసాధనకు అండగా ఉంటామని హామీ

తుంగతుర్తి, ఆగస్టు 6,(ప్రజా జ్యోతి):
తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూళ్ల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో సీఈసీ విభాగంలో 500 మార్కులకు



గాను 486 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి టాపర్‌గా నిలిచిన నాగారం మండలం పసునూరు తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని యలగందుల సాయిధను ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) విద్యార్థి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిధ కు శాలువా కప్పి అభినందనలు తెలియజేసిన ఓయూ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ...ప్రభుత్వ విద్యాసంస్థలో చదువుతూ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. భవిష్యత్తులో ఐఏఎస్ అధికారి కావాలనే సాయిధ లక్ష్య సాధనకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుడు యలగందుల మల్లేష్ కుమార్తెగా సాయిధ ఈ ఘన విజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నాయకులు జంగిలి దర్శన్, డా. వలిగొండ నరసింహ, సురేష్ మహాజన్, మాదాసు రాహుల్, నామ సైదులు, శ్రీకాంత్, ప్రశాంత్‌తో పాటు విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యానికి ఆగ్రహించిన రైతులు

### అసంపూర్ణ కరెంటు తో విసుగొచ్చి సబ్ స్టేషన్ ముట్టడించిన రైతులు

### నాణ్యమైన కరెంటు ఇవ్వాలి రైతుల నినాదాలు

పాలకవీడు, ఆగస్టు 6(ప్రజా జ్యోతి ):
ఎలినినో ప్రభావంతో వర్షాలు లేక సాగర్ ఆయకట్టు సాగు కు నీళ్ళు రాక అయోమయం అవుతున్న రైతన్నకు, ఉన్నంతలోనే ఆగ్రహాలను చుడాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులు వ్యవసాయానికి ఆశాజానకంగా లేకున్న, ఎదో ఉన్నంతలో కొంత సాగు చేసువాలనే వాళ్ళ ఆశ పై గంటకు




ఎంతో కొంత బోర్ మోటార్ల తో వరి నాట్లకు సమాయత్తం అవుతున్న పాలకవీడు మండలం చుట్టు ప్రక్క గ్రామాల నాగిరెడ్డి గూడెం పీడర్ లైన్ రైతులు ఈ త్రీ ఫేజ్ కరెంటు కష్టాలతో రైతులు విసుగు చెంది గురువారం సబ్ స్టేషన్ ముట్టడించి కరెంట్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. గత ప్రభత్వం హయాంలో విద్యుత్ అంతరాయం లేకుండా వచ్చేదని, ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నదని, కరెంటు ఎప్పుడు వస్తోందో, ఎప్పుడు పోతోందో తెలవట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి రోజుకు 14గంటలు కరెంట్ ఇస్తామని ప్రభుత్వం చెప్పిన, ఆ 14గంటల సమయంలో 24సార్లు వచ్చి పోతుందని ఆలా వచ్చి పోవటం వలన మోటార్లు, ట్రాన్స్ఫార్మర్ లు కాలిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలిన ట్రాన్స్ఫార్మర్ ను రిపేర్కు తీసుకెళ్లితే 10నుండి 20రోజులు పడుతుందని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.



#### ప్రభుత్వ లోపమా? అధికారుల నిర్లక్ష్యమా?:

ప్రభుత్వం వ్యవసాయానికి రోజుకి 14 గంటల కరెంటు ఇస్తామంటున్నా, అది క్షేత్ర స్థాయిలో అమలు జరగక పోవటం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్యాలను నిర్దేశిస్తాయి, వాటిని అమలు చేయాల్సిన అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనలో లోపం ఉంటే రైతులు విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడించి, తాళం వేసి నిరసనలు, రైతుల రెండు, మూడు సార్లు వచ్చి పోయే కరెంటుతో వారి మోటార్లు కాలిపో కుండా, వెంటనే విద్యుత్ లైన్లు మరమ్మత్తులు చేసి వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు ఇచ్చి పంటలను కాపాడాలని రైతులు విద్యుత్ అధికారులను వేడుకొంటున్నారు.

#### సకాలంలో స్పదించని లైన్మెన్..:

కరెంట్ పోయిన రెండు రోజుల దాక స్పందించని విద్యుత్ అధికారులు లైన్ మైన్ కి రైతులు ఫోన్ చేసి అడిగితే మీరు కరెంట్ పని చేసే వ్యక్తులని తెచ్చుకోండి అన్ని పొంతన లేని సమాధానం చెపుతున్నాడుని, దూసురుగా మాట్లాడుతున్నాడు అని రైతులు వాపోతున్నారు.

#### కరెంట్ డిపార్ట్మెంట్ ఏఈ పందిరి శ్రీను వివరణ:

లైన్ ప్రాబ్లమ్ ఉంది రెండు రోజులు బ్రేక్ డౌన్ ఐనది లైన్ ప్రాబ్లమ్ సరి చేసి రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా చేస్తాం.

## పాలకవీడులో టీబీ నిర్ధారణ పరీక్షలు

పాలకవీడు, ఆగస్టు 6(ప్రజా జ్యోతి ):
ప్రజల్లో క్షయ వ్యాధి (టి బి )ని ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించాలనే లక్ష్యంతో పాలకవీడు మండల కేంద్రంలో ఎ సి ఎఫ్ (ఆక్టివ్ కేస్ ఫైండింగ్ ) క్యాంపును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు టీబీ లక్షణాలపై స్క్రీనింగ్ నిర్వహించి, అనుమానితులను గుర్తించి టీబీ నిర్ధారణకు అవసరమైన పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సి హెచ్ ఓ సల్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీని తొలిదశలో గుర్తిస్తే పూర్తి చికిత్సతో నయం చేయవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న టీబీ నిర్ధారణ పరీక్షలు, చికిత్స సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ధనమ్మ, అంజలి ఎం ఎల్ హెచ్ ఫి.జిఎం నర్సయ్య, విజయ సుశీల, ఆశా కార్యకర్తలు సునీత, స్వాతి, స్వప్న, లలిత, కవిత, వేంకటమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొని ఇంటింటా టీబీ అనుమానితులను గుర్తించడం, పరీక్షలకు పంపించడం, వ్యాధి నివారణపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. "టీబీ రహిత సమాజమే లక్ష్యం – అనుమానం ఉంటే పరీక్ష చేయించుకోండి, నిర్ధారణ అయితే పూర్తి చికిత్స పొందండి" అని వైద్య సిబ్బంది ప్రజలకు పిలుపునిచ్చారు.



## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక ఆచార్య జయశంకర్ కు ఘన నివాళి

తుంగతుర్తి, ఆగస్టు 6,(ప్రజా జ్యోతి):
తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా గురువారం తుంగతుర్తి లోని బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ...నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను



రగిలించి, ఉద్యమానికి సిద్ధం చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు, సిద్ధాంతాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయశంకర్ సార్ ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, సర్పంచులు తప్పట్ల ఎల్లయ్య, చింతకుంట్ల మనోజ్,గోపగాని రమేష్, తడకమళ్ల రవికుమార్, కుంటపెల్లి సుధాకర్, నల్లబెల్లి వెంకటేష్, బొజ్జ సాయికిరణ్,వెంకటేష్, మల్లిఖార్జున్, అఖిల్, సురేష్, మధు తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్ సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## కోతుల బెడదపై మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):
పురపాలకంలో కోతుల బెడద పెరగడంతో మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. కోతులు ఇళ్లలోకి ప్రవేశించి మహిళలు, చిన్నారులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ప్రజలు వార్డు సభలు, వినతిపత్రాల ద్వారా ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్



ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా కోతులను పట్టే కార్యక్రమం కొనసాగుతోంది. ప్రస్తుతం జిల్లా పరిషత్ పాఠశాల, సరస్వతి విద్యాలయం పరిసర ప్రాంతాల్లో కోతులను పట్టుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

## రాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు

### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

### జయశంకర్ సేవలు భావితరాలకు ఆదర్శం

### జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

నల్గొండ ఆగస్టు 6,(ప్రజా జ్యోతి ): తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని ధార పోసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92 వ





జయంతిని పురస్కరించుకొని, గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను కొనియాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుండే తెలంగాణ భావజాలాన్ని వ్యాపింప చేశారని ,తెలంగాణ సిద్ధాంతకర్తగా ఆయన పేరు పేరొందారని అన్నారు.శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డిఆర్ఓ దశరథ్, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, వివిధ విభాగాల అధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులర్పించారు.

# ఆగస్టు 10 నా జైలు బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

☆ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం



**నవీపేట్ (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలో ఆగస్టు 10న జైలు బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను గురువారం ఆవిష్కరించడం జరిగింది. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవేందర్ సింగ్ సిఐటియు జిల్లా నాయకులు నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని దాంట్లో భాగంగానే రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టి కార్పోరేట్లకు భూములు కట్టబెట్టాలనే ఉద్దేశంతోటి విత్తన సవరణ బిల్లు విద్యుత్ సవరణ బిల్లు లాంటివి తీసుకురావడానికి వారు తీవ్రంగా ఖండించారు కార్మికులకు 29 లేబర్ చట్టాలను రద్దుచేసి కేవలం నాలుగు కోట్లు గా విభజించే ప్రణాళికను తప్పుపట్టారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కల్పించాలని తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి వి వి జి రాంజీ చట్టాన్ని తీసుకురావడానికి తప్పుపట్టారు వీటన్నింటి రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇందువల్ల రైతాంగము కార్మికులు కర్షకులు నష్టపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు విడగొట్టు చిన్న ఒడ్డెన్న నందిగామ గ్రామ కార్యదర్శి బైరి కిరణ్, కర్రె శ్రీనివాసు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ పి వసంత్, కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# రెంజల్‌లో ఘనంగా ప్రపంచ తల్లీ పాల వారోత్సవాలు



**రెంజల్, ఆగష్టు 06, ( ప్రజాజోతి ):** రెంజల్ మండల కేంద్రం లో గల రైతు వేదిక ఆవరణలో ప్రపంచ తల్లీ పాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ నందిని ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అవగాహన కార్యక్రమంలో ప్రతి గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు తల్లి పాలు, ముర్రు పాలు మరియు పోషకాహారం యొక్క ప్రాముఖ్యత గురించి వివరంగా అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే అరగంటలోపు తల్లి పాలు ఇవ్వడం వల్ల పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి లలితబుజ్జి,ఎంపీడీఓ కమలాకర్, తహసిల్దార్ శ్రవణ్ కుమార్,ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య,లక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ మాలాన్ బి,మహిళ సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందల్వాయి ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలు



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) ఆగస్టు. 6** ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్వో బాలయ్య హాజరై తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన శిశువుకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని ఆయన తెలిపారు. ఈ కార్య క్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుశాంత్, సూపర్వైజర్ సమాధానం మేరీ, అంగన్‌వాడీ టీచర్ శారద, ఏఎన్ఎం నిర్మల రాణి, ఆశా వర్కర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, సరైన పాలిచ్చే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు

☆ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

☆ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజాజ్యోతి)** ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం నిరంతర పోరాటం చేసిన గొప్ప మేధావి, విద్యావేత్త, ఉద్యమకారుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. సమాజ అభివృద్ధి, విద్యా వికాసం, సామాజిక న్యాయం, ప్రాంతీయ సమానత్వం కోసం ఆచార్య జయశంకర్ చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనబెట్టి ప్రజల ఆకాంక్షల సాధనకే తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తిత్వమని కొనియాడారు. ఆచార్య జయశంకర్ చూపిన మార్గంలో నడుస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, బిసి వెల్ఫేర్ నరసయ్య. టీఎన్జీవో అధ్యక్షుడు నారాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ఫిజియో అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి. సెక్రటరీ సాయి రెడ్డి. జిల్లా అధికారులు, వివిధ శాఖల అధిపతులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.








# ఈవీఎం గోదాంను తనిఖీ

☆ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ నెలవారి తనిఖీలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా గోదాంలో అమలవుతున్న భద్రతా ఏర్పాట్లు, ద్వంద్వ తాళాల విధానం, సీసీటీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాల అందుబాటు, సందర్శకుల నమోదు పుస్తకం, భద్రతా రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం గోదాంలో అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. గోదాంలో 24 గంటల భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలోఅదనపు కలెక్టర్ విక్టర్. అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి. సంబంధిత ఎన్నికల శాఖ అధికారులు, గోదాం ఇన్‌చార్జి, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# మీ సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ అశోక్



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఉన్న మీ సేవా కేంద్రాన్ని తహసీల్దార్ అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలు, దరఖాస్తుల స్వీకరణ, ధ్రువపత్రాల జారీ విధానం, పెండింగ్ దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా సేవలు అందించాలని మీ సేవా కేంద్ర నిర్వాహకులకు తహసీల్దార్ సూచించారు. ప్రభుత్వ సేవల కోసం వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అనవసర జాప్యం లేకుండా నిర్ణీత గడువులో సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుములకే పరిమితం కావాలని, అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీ సేవా కేంద్రాల ద్వారా అందించే సేవల నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

### తాసిల్దార్ కార్యాలయంలో

# ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సర్ జయంతి వేడుకలు



**కొండాపూర్ ప్రజా జ్యోతి** తెలంగాణ సిద్ధాంతకర్త, మేధావి, ఉద్యమకారుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సర్ జయంతిని కొండాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో జయశంకర్ సర్ చిత్రపటానికి తాసిల్దార్ అశోక్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ సర్ చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనియాడారు. తెలంగాణ కోసం జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడిగా ఆయనను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొని జయశంకర్ సర్ ఆశయాలను ఆచరణలో కొనసాగించాలని సంకల్పించారు. తెలంగాణ అభివృద్ధికి ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలు

☆ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించిన ప్రజాప్రతినిధులు



**అందోల్, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా అందోల్--జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రజాప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తిగా ఆయనను స్మరించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజా సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, టీపీవో నిహాల్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని జయశంకర్‌కు ఘన నివాళులర్పించారు.

### కష్టకాలంలో చేయూత

# యువజన కాంగ్రెస్ నాయకుడి మానవత్వం

☆ వని పాండు కుటుంబానికి ఆర్థికసాయం అందించిన ప్రవీణ్ కుమార్



**అందోలు, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** అందోలు మండలం కన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన వని పాండు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అందోలు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అండగా నిలిచారు. గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి దుఃఖంలో భాగస్వామ్యమయ్యారు. అనంతరం తన వ్యక్తిగత సహాయంగా పాండు అంత్యక్రియల కోసం రూ.6 వేల నగదు అందజేసి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న కుటుంబాలకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. బాధిత కుటుంబానికి అవసరమైతే భవిష్యత్తులోనూ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, వార్డు సభ్యుడు మోహన్, యువ నాయకులు ఈశ్వర్, మచ్చేందర్, కాంగ్రెస్ నాయకులు వెంకయ్య, సత్తయ్య, శంకర్, భూమయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

☆ కలెక్టరేట్‌లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 6:--**తెలంగాణ రాష్ట్ర సాధనను జీవిత లక్ష్యంగా చేసుకుని, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక బలాన్ని అందించి, తన జీవితాన్ని తెలంగాణ ప్రజల హక్కుల కోసం అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయాలు భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని చారిత్రక, సామాజిక, ఆర్థిక ఆధారాలతో ప్రపంచానికి వివరించిన దార్శనికుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమకారుడిగా ఆయన చేసిన సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాకుండా తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహా మేధావి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సైద్ధాంతిక దిశానిర్దేశం చేసిన ఆయన రచనలు, ఉపన్యాసాలు, పరిశోధనలు ఉద్యమానికి అపారమైన మేధోబలాన్ని అందించాయని పేర్కొన్నారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు, సమానత్వం, ప్రాంతీయ న్యాయం, సామాజిక చైతన్యంపై చేసిన అధ్యయనాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు . అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ చూపిన విలువలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



### ఘనంగా ప్రొఫెసర్

# జయశంకర్ 92వ జయంతి వేడుకలు



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 6:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా పలువురు నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి, కౌన్సిలర్లు వివేకానంద్, బాణపురం రాజు ముదిరాజ్, రామకృష్ణ, సుబూర్, షారుఖ్ ఖాన్, గోపాల్ రెడ్డి, మొహీద్, లక్ష్మణ్, మైతాబ్, తహేర్ అలీ, పాండు, మాణిక్యం తదితరులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




### శ్రీరేణుక ఎల్లమ్మ కృపతో

# ఫోటోగ్రాఫర్లను చల్లంగా చూడమ్మా

☆ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుల విజయకుమార్

**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** ఆషాడమాసం పురస్కరించుకొని సదాశివపేట ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు నైవేద్యం కార్యక్రమాన్నిహాఅసోసియేషన్ అధ్యక్షులు నాగుల విజయకుమార్‌హావారి సభ్యులు గురువారం స్థానిక గ్రామదేవతలైన రేణుక ఎల్లమ్మ దుర్గమ్మహా మందిరంలో అమ్మవార్లకు నూతన వస్త్రాలుహా ఓడి బియ్యంహా పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాడమాసం గ్రామదేవతల కొలిచే మాసమని ఈ మాసంలో అమ్మవార్లనుహా కొలిచినహా వారిహా కి కొంగు బంగారంహా అని పిల్లాపాపలను ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతోహాడించుతాదన్న నమ్మకంతో అమ్మవార్లను వేడుకుంటారని ఈ మాసంలో గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుందన్నారు. అమ్మవార్ల దయతో ఫోటో వీడియో గ్రాఫర్లనుహాచల్లంగా చూడాలని వేడుకుంటామన్నారు. హాఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులుహా బిట్ల రాజు. జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్. శ్రీనివాస్. సభ్యులు సంగమేష్. అశోక్ సత్తిబాబు. రాజు. వీరేష్. మల్లేశం. మహేష్ ,ప్రసాద్. తదితర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ లు పాల్గొన్నారు.



## జానకంపల్లిలో బాధిత కుటుంబాలను
# పరామర్శించిన బిఆర్ఎస్ నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

మెదక్ (ప్రజా జ్యోతి) మెదక్ మండలం జానకంపల్లి గ్రామంలో బిఆర్ఎస్ నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను నేరుగా పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. జానకంపల్లి మాజీ సర్పంచ్ సంగమేశ్వర్









సోదరుడు దివిటి అంజయ్య ఇటీవల మృతి చెందడంతో, తిరుపతిరెడ్డి వారి గృహానికి వెళ్లారు. అంజయ్య చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. అలాగే గ్రామానికి చెందిన మార్గం పోచమ్మ మరణ వార్త తెలుసుకున్న ఆయన, ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సోములు, మాణిక్య రెడ్డి, చిట్యాల, సంగాయిగూడ మాజీ సర్పంచ్‌లు వెంకటేశం, రవి, నాయకులు సిద్దిరాములు, దుర్గేష్, నవీన్, సాయిలతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెదక్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

☆ ఘనంగా నివాళులర్పించిన నాయకులు


☆ తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

☆ మెదక్ దీ=ా నాయకుల పిలుపు

మెదక్ (ప్రజా జ్యోతి) తెలంగాణ సిద్ధాంతకర్త, తొలి, మలిదశ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 83వ జయంతి సందర్భంగా మెదక్ పట్టణ బిఆర్ఎస్ (టిఆర్ఎస్) నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జీవితాంతం వివాహం చేసుకోకుండా, తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనకే అంకితం చేసిన అమరజీవి ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఈ జయంతి కార్యక్రమంలో మెదక్ పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్లు బట్టి జగపతి, ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కేవల్ జగదీష్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు







వేసి అంజలి ఘటించారు. వారితో పాటు పార్టీ కౌన్సిలర్లు మామిండ్ల ఆంజనేయులు, బట్టి ఉదయ్ కుమార్, ముఖ్య నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్, ప్రభు రెడ్డి, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మాయ మల్లేశం, ఆర్కే శీను తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలంగాణ ముద్దుబిడ్డ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# స్వయం ఉపాధి కోసం ఎల్ఈడీపీ శిక్షణ

సిద్దిపేట,ఆగస్టు 06,(ప్రజాజ్యోతి): మహిళల ఆర్థిక సాధికారతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో అవసరమని డీఆర్డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సుధీర్ అన్నారు. నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం ఆర్థిక సహకారంతో, సెట్విన్ ఆధ్వర్యంలో 30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు వస్త్ర తయారీ, అపారెల్, హోమ్ ఫర్నిషింగ్ అంశాలపై 20 రోజుల లైవ్లీహుడ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శిక్షణను గురువారం సిద్దిపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. శిక్షణ ద్వారా మహిళలు ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని స్వయం ఉపాధి







రంగంలో విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. యూబీఆర్‌సెటీ డైరెక్టర్ నాయక్ మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలతో పాటు వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, నాణ్యత ప్రమాణాలు, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కూడా అవసరమని సూచించారు. సెట్విన్ ప్రాజెక్టు డైరెక్టర్ అమీనా మాట్లాడుతూ శిక్షణ పూర్తిగా ప్రాక్టికల్ విధానంలో నిర్వహించబడుతుందని, నిపుణులచే గార్మెంట్ డిజైనింగ్, హోమ్ ఫర్నిషింగ్ ఉత్పత్తుల తయారీ, నాణ్యత నియంత్రణ తదితర అంశాల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు అవసరమైన మార్గదర్శకత్వం కూడా అందిస్తామని తెలిపారు.

# 100 కి.మీ అల్ట్రా రన్ విజేత కాస రాజుకు ఘన సన్మానం

☆ మిరుదొడ్డి రన్నర్స్ ఆధ్వర్యంలో 2కే రన్, బహుమతుల ప్రదానం

మిరుదొడ్డి, ఆగస్టు 6, (ప్రజాజ్యోతి) : సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన కాస రాజు పూణే నుంచి బారామతి వరకు 100 కిలోమీటర్ల అల్ట్రా రన్ ను 14 గంటల్లో విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా మిరుదొడ్డి రన్నర్స్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో యువకులు, విద్యార్థులతో 2కే రన్ నిర్వహించారు. రన్ లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ, కాస రాజు మిరుదొడ్డి వాస్తవ్యులు కావడం గర్వకారణమని కొనియాడారు. గ్రామ స్థాయిలో చిన్నగా రన్నింగ్ స్టార్ట్ చేసి, హాఫ్ మారథాన్, ఫుల్ మారథాన్ దాటి అల్ట్రా రన్ వరకు చేరుకున్న కాస రాజు యువతకు ఆదర్శమని అన్నారు. యువత శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతిరోజు వ్యాయామం, రన్నింగ్, వాకింగ్ చేయాలని పిలుపునిచ్చారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చని కాసరాజు తెలియజేశారు. అనంతరం 2కే రన్ లో పాల్గొన్న యువకులు, విద్యార్థులకు అంబలి, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎలుముల మహేశ్వరి దేవరాజు, ఉప సర్పంచ్ పెద్ద కుర్మ కర్ణాకర్, అందే సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ పరశురాములు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు, కొండాపూర్ సర్పంచ్ అమర్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు, మిరుదొడ్డి రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## మెదక్‌లో రూ.1.06 కోట్లతో అభివృద్ధి పనుల పండగ
# 13వ వార్డులో సీసీరోడ్ల నిర్మాణానికి శ్రీకారం

మెదక్ (ప్రజా జ్యోతి) మెదక్ పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి! మెదక్‌ను అన్ని రంగాల్లో ముందుంచడమే లక్ష్యంగా యంగ్ అండ్ డైనమిక్ నాయకుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నిరంతరం కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా, మెదక్ పట్టణంలోని 13వ వార్డులో రూ. 1 కోటి 6 లక్షల భారీ వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. అభివృద్ధి అంటే కేవలం ప్రకటనలకే పరిమితం కాదని, ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు కనిపించడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మెదక్ పట్టణంలోని ప్రతి వార్డుకూ సమాన ప్రాధాన్యతనిస్తూ రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక





సదుపాయాలు కల్పించడమే తమ బాధ్యత అని తెలిపారు. అనేక ఏళ్లుగా సీసీ రోడ్ల కోసం ఎదురుచూస్తున్న 13వ వార్డు ప్రజలు, ఈ పనులు ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే వార్డు వాసులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో మెదక్ పట్టణ రూపురేఖలు మార్చేందుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కౌన్సిలర్ చెదల్ సంధ్య నవీన్ కుమార్, ప్రజాప్రతినిధులు అస్తరుగల్ల బాలరాజ్, రాజశేఖర్, అరుణ, సిద్ధిరాములు, కో-ఆప్షన్ సభ్యురాలు అనూషతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జయశంకర్ సార్ తెలంగాణకు దిక్సూచి

☆ గ్రామీణాభివృద్ధి - మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం ☆ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపల్ (ప్రజా జ్యోతి ) తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, మహోన్నత మేధావి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం రామాయంపేట పట్టణంలో జయశంకర్ సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బలాన్ని అందించిన మహనీయుడని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నంతా అంకితం చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తిత్వం జయశంకర్ సార్‌దని కొనియాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఆయన కలలు కన్న అభివృద్ధి, సమాన అవకాశాలు, గ్రామీణ ప్రగతి, విద్యా వికాసం, యువత సాధికారత దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. జయశంకర్ సార్ చూపిన మార్గం భావితరాలకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తుందని, ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ -- వివేకానంద ఆశయాలతో





సమాజ నిర్మాణం -- ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు రామాయంపేట పట్టణంలో డా. బి.ఆర్. అంబేద్కర్ మరియు స్వామి వివేకానంద విగ్రహాల ప్రతిష్ఠకు భూమిపూజ నిర్వహించిన సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ... డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని, సామాజిక న్యాయం, సమానత్వం, విద్య ద్వారా సమాజ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. స్వామి వివేకానంద యువతకు ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. యువత మహనీయుల ఆశయాలను ఆచరిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అంబేద్కర్ బోధించిన రాజ్యాంగ విలువలు, వివేకానంద సందేశించిన మానవతా భావాలు ప్రతి ఇంటికీ చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ మహనీయుల విగ్రహాలు భావితరాలకు స్ఫూర్తి కేంద్రాలుగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# బురదలో వరి నాట్లు వేసి హరీష్‌రావు పరువు తీశారు

సిద్దిపేట,ఆగస్టు 06,(ప్రజాజ్యోతి): సిద్దిపేటలో వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన బురదలో కొందరు బీఆర్ఎస్ నాయకులు వరి నాట్లు వేయడం ద్వారా ఎమ్మెల్యే హరీష్‌రావు పరువు తీశారని సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ విమర్శించారు. సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఎమ్మెల్యేకు నిధులు కేటాయిస్తారని, హరీష్‌రావుకు కూడా ఎమ్మెల్యే నిధులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఆ నిధులను వినియోగించి దెబ్బతిన్న రహదారులను వెంటనే అభివృద్ధి చేయాలని, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించడం కంటే తమ ఎమ్మెల్యేతో రోడ్లు వేయించాలని కోరాలని సూచించారు. ప్రతిరోజూ ఏదో ఒక సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడమే బీఆర్ఎస్ నాయకుల పనిగా మారిందని



అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల కోసం కేటాయించిన ఎమ్మెల్యే నిధులను హరీష్‌రావు ఏ పనులకు ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఆ అంశానికి సంబంధించిన నిజానిజాలు త్వరలోనే ప్రజలకు తెలుస్తాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని ఆరోపించిన అత్తు ఇమామ్, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందలేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దీర్ఘకాలం కొనసాగేందుకు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. రానున్న సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి చైర్మన్ పదవిని కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు, గయాజుద్దీన్, అర్షద్ ,హుస్సేన్, విజయ, డానియల్, నజ్జు బాబా తదితరులు పాల్గొన్నారు

# జయశంకర్ ఆశయాలే తెలంగాణకు దిక్సూచి

☆ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట,ఆగస్టు 06,(ప్రజాజ్యోతి): ఆచార్య జయశంకర్ జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు పోరాడిన మహనీయుడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కొనియాడారు. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ఆయనకు సిద్దిపేటతో విడదీయరాని అనుబంధం ఉందని, సిద్దిపేటలో అమరవీరుల స్తూపానికి ఆయన చేతుల మీదుగానే శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమవుతుందని విశ్వసించి జయశంకర్ ఆయనకు అండగా నిలిచారన్నారు. జయశంకర్ వ్యక్తి కాదని, ఒక శక్తి అని పేర్కొంటూ, తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగం, పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జయశంకర్, కేసీఆర్‌ల నిరంతర పోరాట ఫలితమేనన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా నదీజలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ ఫలితంగా గోదావరి జలాల్లో 383 టీఎంసీల వినియోగానికి కేసీఆర్ ప్రభుత్వం





అనుమతులు సాధించిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఒక్క కొత్త ప్రాజెక్టుకూ అనుమతులు తీసుకురాలేదని అన్నారు. ప్రస్తుతం ఉన్న అనుమతులు కూడా రద్దయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. జీఆర్ఎంబీ ఎజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను అడ్డుకునే ప్రతిపాదనలు చేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును ఎందుకు అడ్డుకోవడం లేదని, సమ్మక్కసాగర్‌కు కేటాయించిన నీటిని ఎందుకు కాపాడడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ హక్కులు, నీటి వాటాను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. జయశంకర్‌కు నిజమైన నివాళి అంటే తెలంగాణకు రావాల్సిన నీటి హక్కులను కాపాడుకోవడమేనని ఆయన అన్నారు.

# అంతర్‌రాష్ట్ర వాహన దొంగ అరెస్ట్

☆ రూ.10 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం

కొండపాక , ఆగస్టు 6: (ప్రజా జ్యోతి):- కుకునూరుపల్లి పోలీసులు అంతర్‌రాష్ట్ర వాహన దొంగను అరెస్ట్ చేసి, సుమారు రూ.10 లక్షల విలువైన రెండు కార్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన పెండ్యాల సుదర్శన్ (32)ను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితుడు క్యాబ్ డ్రైవర్లను దూర ప్రాంతాలకు తీసుకెళ్లాలని నమ్మించి, మార్గమధ్యలో నిర్మానుష్య ప్రాంతాల్లో వాహనాలు ఆపించి డ్రైవర్ కారు దిగిన వెంటనే వాహనాలతో పరారయ్యేవాడు. ఈ క్రమంలో కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసు దర్యాప్తులో సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు టూ34 ఎదీ 7506, టోయోటా ఎటియోస్ కారు ఆూ31 వూ 2556, రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ బైక్ టూ04 ఖీజీ 6045ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన దొంగతనాల కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ లతీఫ్, ఎస్ఐ బాలకృష్ణతో పాటు పోలీసు బృందాన్ని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు.



## ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: జంపన ప్రతాప్

– న్యూ బోయినపల్లిలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ





**బోయిన్ పల్లి, ఆగస్టు 06 (ప్రజాజ్యోతి) :** న్యూ బోయినపల్లి జయనగర్ చౌరస్తాలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేశారని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమం, నాన్-ముల్కీ ఉద్యమం, "సాంబార్-ఇడ్లీ గో బ్యాక్" ఉద్యమం వంటి పలు ఉద్యమాల్లో ఆయన చురుకుగా పాల్గొని తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని చాటారని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.డాక్టర్ సతీష్ చంద్ర మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సాధించినప్పటికీ ఆచార్య జయశంకర్ కలలు కన్న సమగ్ర అభివృద్ధి ఇంకా పూర్తిస్థాయిలో జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్. శ్రీను, మాజీ డైరెక్టర్ డి. శ్రీనివాస్, ఓం ప్రకాష్ యాదవ్, ముకేశ్, మధు, వెంకట చారి తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేం

- ఘనంగా జయశంకర్ 92వ జయంతి వేడుకలు
- విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రముఖులు
- ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పోరాడుతాం
- తాండూరు జనసమితి ఇంచార్జ్ సాంబురు సోమశేఖర్
- ప్రజాసంఘాల నాయకులు
- విజయ్ కుమార్, శ్రీనివాస్, రామకృష్ణ





**తాండూరు ఆగస్టు 6 ప్రజా జ్యోతి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు తాండూరు పట్టణం ఇందిరా చౌక్‌లోని జయశంకర్ సార్ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గురువారం నాడు తెలంగాణ జన సమితి, ప్రజాసంఘాలు, విద్యావంతుల వేదిక, ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా మున్సిపాల్ మాజీ కౌన్సిలర్,టీజేస్ ఇంచార్జ్ సాంబురు సోమశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఆయనను విస్మరించిందని ఇప్పటి ప్రభుత్వం ఆయన జయంతి అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ ఆయన జీవిత చరిత్ర,ఆలోచన విధానం నేటి తరం యువకులకు, విద్యార్థులకు చేరేవిధంగా జయంతి నాడు కార్యక్రమాలు నిర్వహించలేకపోతుందని గుర్తు చేశారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పాలన వ్యవస్థ జరగాలని,ప్రజాస్వామ్య తెలంగాణ సాధనలో అందరూ భాగం కావాలని, జయశంకర్ స్ఫూర్తితో ప్రశ్నించే తత్వం అందరు అలవర్చుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం ఉద్యమకారులకు, నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారిని విస్మరిస్తే మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.

అనంతరం తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.విజయ్ కుమార్,పర్యాద రామకృష్ణ, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ లు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని యావత్ ప్రజలకు వివరించి చైతన్యపరిచి,ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగం చేసి రాష్ట్ర సాధనకు మార్గదర్శనం చేసిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి తెలిసే విధంగా ప్రభుత్వం, బుద్ధిజీవులు కృషి చేయాలని కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా అణగారిన వర్గాలకు,కార్మిక, కర్షకులకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ సానిటరీ ఇన్స్పెక్టర్ రాములు,జనస మితి నాయకులు గౌరీ, సందీప్,విద్యావంతుల వేదిక నాయకులు చెనిమిళ్ల విజయ్ కుమార్, రవీందర్, అధ్యాపకులు రవీందర్ రెడ్డి, రాజశేఖర్,గాయకుడు బలరాం,ఉద్యమ నాయ కులు ఫిరోజ్ ఖాన్,వెంకట్, ఆర్టీసీ కార్మిక నాయకుడు యాలిశెట్టి వీరప్ప,మున్సి పాల్ జవాన్ శ్రీను,తదిత రులు పాల్గొన్నారు.

## కొడంగల్ నియోజకవర్గం 72 పోలింగ్ స్టేషన్లో సర్ 100% 100% పూర్తి



**కొడంగల్ ఆగస్టు 6 ప్రజా జ్యోతి :** కొడంగల్ నియోజకవర్గంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమం విజయవంతంగా కొడంగల్ నియోజకవర్గ 72 పోలింగ్ స్టేషన్ లో 100% పూర్తి చేయడం జరిగిందని కొడంగల్ నియోజకవర్గం సర్ అసెంబ్లీ కన్వీనర్ మాణిక్యం మల్లేష్ యాదవ్ తెలుపుతూ ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ఓటర్ల జాబితాను ఖచ్చితంగా సరిదిద్దడం, అర్హులైన ప్రతి పౌరుడిని ఓటరు జాబితాలో చేర్చడం మరియు తప్పుల్ని సరిచేయడం. ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసినా – బూత్ లెవెల్ ఆఫీసర్లు బిఎల్ఓలు, బిఎల్ఏలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు– నియోజకవర్గ ప్రజలకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రత్యేకంగా, ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో అంకితభావంతో పనిచేసిన సిబ్బంది వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని తెలిపారు. ఇకముందు కూడా ఓటరు హక్కులను పరిరక్షిస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరుచున్నాను.

## ఆచార్య జయశంకర్ ఆశయాలు చిరస్మరణీయం

– ఓల్డ్ బోయిన్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు
– మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ నివాళి





**బోయిన్ పల్లి, ఆగస్టు 06 (ప్రజా జ్యోతి) :** ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఓల్డ్ బోయిన్‌పల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ఆచార్య జయశంకర్ అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు, ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. తెలంగాణ సమాజం ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ హరినాథ్, పద్మ, మట్టి శ్రీనివాస్, పిట్ల రాజు, శ్రీశైలం చారి, బుర్రి యాదగిరి, వెంకటేష్, గణేష్, రాజు గౌడ్, చందర్, పోచయ్య, చందు యాదవ్, శ్యామ్ సుందర్, భిక్షపతి, గుడి రాజు, మేక ఉదయ్, గౌస్ తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

## స్వరాష్ట్ర సాధనలో జయశంకర్ సార్ పాత్ర అమోఘం



**కొడంగల్ ఆగస్టు 06 ప్రజా జ్యోతి :** తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ జాతిపితంగా పేరొందిన జయశంకర్ సార్ జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పాత్ర అమోఘమని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎర్రన్ పల్లి శ్రీనివాస్, 2వ వార్డ్ కౌన్సిలర్ వాణిశ్రీ మధు సూదన్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాసాని వెంకటయ్య,అంబేద్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్లు అన్నారు.సారు జయంతి సందర్భంగా కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ధ్యేయంగా కార్యాచరణ రూపొందించి, ప్రజలను మమేకం చేసిన మహనీయుడని కొనియాడారు.ఆంధ్ర వలసవాదుల పాలనలో తెలంగాణ కు జరుగుతున్న అన్యాయాన్ని కూలంకషంగా వివరించి,ప్రాంతీయ వాదాన్ని లేవనెత్తిన ధైర్యశాలి అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఒకవైపు ఉద్యమం, మరోవైపు రాజకీయ వత్తిడి తో సాధ్యమైతదనీ భావించి ఆదిశగా అందరినీ సంఘటితం చేయడంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందన్నారు. ఏర్పడిన తెలంగాణ లో ఇప్పటికీ పూర్తి స్థాయిలో నిధులు, నీళ్ల నియామకాలు పూర్తి స్థాయిలో అందలేదని, నీళ్లు, నిధులు, నియామకాలు అందరికీ అందినప్పుడే జయశంకర్ సార్ కలలు సాకారమవుతాయనీ, దానికి విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఈఎప్పటికప్పుడు తమ గళం విప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి రమేష్, పర్సాపురం మొగలప్ప,అజయ్ గణేష్,ఇంతియాజ్ వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



**పరిగి, ఆగస్టు 06 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతపరమైన పునాదులు వేసిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె.జయశంకర్ జయంతి సందర్భంగా పరిగి మండల తహసీల్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వాసు చంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొని జయశంకర్ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, భావితరాలకు ఆదర్శప్రాయమని అన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జయంతి వేడుకలు
- ఆయన లక్ష్యాన్ని నెరవేర్చాలి
- కళాశాల ప్రిన్సిపల్ ఏ వసంత కుమారి



**తాండూరు ఆగస్టు 6 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ శివరులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ వసంతకుమారి ఆధ్వర్యంలో, సంస్కృతిక విభాగం కల్చరల్ కమిటీ సంయుక్తంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ తెలంగాణ ముద్దు బిడ్డ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు నిర్వహించడం సంతోషకరమన్నారు. జయశంకర్ తెలంగాణ ప్రాంతంపై జరుగుతున్న అనేక పరిణామాలను తెలియపర్చేలా తన రచనలు పరిశోధనలు చేసి తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాల దోపిడి అలాగే సాంస్కృతిక అణచివేత యాస, భాష కట్టుబొట్టు అవమానానికి గురైన విధానాన్ని నేటి తరానికి తెలిసేలా రూపాంతరం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ అందరికి ఆదర్శప్రాయంగా నిలిచాయని చెప్పారు. అకుంటిత దీక్షతో తెలంగాణలో ఎదురౌతున్న అనేక సమస్యలను దేశ, విదేశాల్లో పలు వేదికల పైన ప్రజెంట్ చేసి తెలంగాణ రాష్ట్ర సాధనకు పురుడు పోశారని చెప్పారు. ఆయన చేసిన రచనలు ఉద్యమ స్ఫూర్తి తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి నాంది పలుకుతుందన్నారు.

ఈ సమావేశంలో సీనియర్ అధ్యాపకులు సంగమేశ్వర్, కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ మహేందర్ రెడ్డి, ఐక్యుఎసి కోఆర్డినేటర్ కిషన్, కళాశాల కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ డి. నారాయణరావు, సభ్యులు మమతా శాండిల్, షబాజ్ బేగం, మఖ్బుల్ ,అమరేందర్ ( తెలుగు, ఉర్దూ, హిందీ, ఆంగ్ల విభాగలకు చెందిన అధ్యాపక బృందం, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జయశంకర్‌కు నివాళులు..

తెలంగాణ అభివృద్ధిపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు



**షాద్‌నగర్, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి) :** ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని న్యూ సిటీ కాలనీలో ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్, కేసీఆర్ కలిసి ఉద్యమాన్ని ముందుకు నడిపారని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం జయశంకర్ ఆశయాల సాధనకు కేసీఆర్ కృషి చేశారని పేర్కొన్నారు. అలాగే గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యుత్, సాగునీటి రంగాల అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. 2028 తర్వాత బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, జయశంకర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్తామని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆచార్య జయశంకర్‌కు నివాళులర్పించారు.

## సర్వపక్ష సమావేశం నిర్వహించిన జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్




**శేరిలింగంపల్లి,ఆగస్టు 06 (ప్రజాజ్యోతి) :** శేరిలింగంపల్లిలో ఈఆర్వో నారాయణ్ అమిత్ ఐఏఎస్ ఆధ్వర్యంలో సర్వపక్ష సమావేశం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఐఏఎస్ ఆధ్వర్యంలో గురువారం శేరిలింగంపల్లి జోన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఒక ముఖ్యమైన సర్వపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు అందరూ హాజరయ్యారు.

ఆగస్టు 10తో ముగియనున్న ఎస్ఐఆర్ గడువు ముమ్మరంగా చర్చలు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటర్ల జాబితా సంస్కరణల కోసం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ ప్రక్రియ గడువు ఈనెల ఆగస్టు 10వ తేదీతో ముగియనుంది.ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమాల పురోగతిపై ఈఆర్వో నారాయణ్ అమిత్ ఐఏఎస్. అధికారులతో కలిసి సమీక్షించారు.తుది గడువు సమీపిస్తున్నందున ఓటరు నమోదు, మార్పులు–చేర్పుల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.రాజకీయ పార్టీల సూచనల ప్రకారమే తదుపరి చర్యలు ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటర్ల జాబితా సవరణపై పలు కీలక సలహాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఈఆర్వో నారాయణ్ అమిత్ ఐఏఎస్ సానుకూలంగా స్పందిస్తూ,రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చిన అమూల్యమైన సూచనలను స్వీకరించి,వాటికి అనుగుణంగానే పారదర్శకంగా తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా,ఎలాంటి తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు,అధికారులు సమన్వయంతో సహకరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.



## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక జయశంకర్ సార్

– చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ – జయశంకర్ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఘన నివాళి





**పరిగి, ఆగస్టు 06 (ప్రజాజ్యోతి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, తెలంగాణ ఉద్యమానికి పునాదులు వేసిన మహనీయుడు ప్రొఫెసర్ కె.జయశంకర్ అని పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ కొనియాడారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే జయశంకర్ సార్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని ఆమె అన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం పరిగి మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. తన వ్యక్తిగత, కుటుంబ జీవితాన్ని సైతం త్యాగం చేసి తెలంగాణ సాధన కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు ఆదర్శమని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో నడిపించడమే ఆయన ఆశయాలకు నిజమైన గౌరవమని అన్నారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రార్థసారథి పంతులు, మున్సిపల్ కమిషనర్ కె.మల్లేష్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గద్దర్ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ఉద్యమానికి తన గీతాలతో ఊపిరి పోసిన ప్రజాకవి గద్దర్ సేవలు చిరస్మరణీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గద్దర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దశాబ్దాల పాటు తన పాటలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూ తెలంగాణ ఉద్యమానికి విశేష సేవలు అందించిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నప్పటికీ ప్రజల కోసం నిరంతరం పోరాడిన నిస్వార్థ నాయకుడిగా ఆయన నిలిచిపోయారని పేర్కొన్నారు. గద్దర్ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సినీ కళాకారులకు ప్రదానం చేసే అవార్డులకు ఆయన పేరును నామకరణం చేయడం ఆయనకు లభించిన గొప్ప గౌరవమని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని గద్దర్ కోరుకున్నప్పటికీ, ఆ క్షణాన్ని చూడకముందే ఆయన మరణించడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ప్రజా ఉద్యమాలకు జీవితాంతం అంకితమైన గద్దర్ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, జేఏసీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని గద్దర్‌కు ఘన నివాళులర్పించారు.

### ఆషాఢంలో ఆరుద్ర పురుగుల సంచారం...

## రైతులు అప్రమత్తంగా ఉంటే పంటలకు రక్షణ

– ఆరుద్ర పురుగుల ఉనికి ప్రకృతి సహజమే... శాస్త్రీయ పద్ధతులతో ముందస్తు చర్యలు తీసుకుంటే పంట నష్టాన్ని నివారించవచ్చు



**నాగారం, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** ఆషాఢ మాసంలో వర్షాలు కురవడం, గాలిలో తేమ శాతం పెరగడం, మేఘావృత వాతావరణం నెలకొనడం వల్ల వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు సాధారణంగా "ఆరుద్ర పురుగులు"గా పిలిచే వివిధ రకాల కీటకాల సంచారం పెరగడం సహజం. ఇవి ప్రకృతి జీవచక్రంలో భాగమైనప్పటికీ, సరైన సమయంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి పంటలకు గణనీయమైన నష్టం కలిగించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆకులను తినే గొంగళి పురుగులు, కాండాన్ని తొలిచే పురుగులు, రసం పీల్చే కీటకాలు ఈ కాలంలో వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఫలితంగా ఆకులు రంధ్రాలు పడటం, మొక్కల ఎదుగుదల మందగించడం, పూత, కాయల రాలిపోవడం, దిగుబడి తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులు భయపడాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండడం అత్యంత అవసరమని సూచిస్తున్నారు. ప్రతి రెండు లేదా మూడు రోజులకు ఒకసారి పొలాలను పరిశీలిస్తూ ఆకులపై పురుగుల గుడ్లు, లార్వా లేదా ప్రారంభ దశలోని నష్టం గుర్తిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కలుపు మొక్కలను తొలగించడం, దెబ్బతిన్న మొక్కల భాగాలను నాశనం చేయడం, ఫెరోమోన్ ట్రాప్స్, లైట్ ట్రాప్స్, బర్డ్ పెర్చ్‌ల వంటి సమగ్ర పురుగుల యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా పురుగుల ఉధృతిని గణనీయంగా తగ్గించవచ్చు. అవసరమైతే మాత్రమే వ్యవసాయ శాఖ లేదా శాస్త్రవేత్తల సూచన మేరకు సిఫార్సు చేసిన క్రిమిసంహారక మందులను నిర్ణీత మోతాదులో ఉపయోగించాలి. అనవసరంగా అధిక మోతాదులో మందులు పిచికారీ చేయడం వల్ల మిత్రకీటకాలు నశించడం, నేల సారవంతత తగ్గడం, ఉత్పత్తి వ్యయం పెరగడం వంటి ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. ఆషాఢంలో ఆరుద్ర పురుగులు కనిపించడం ప్రకృతి సహజమైన పరిణామమే కానీ, రైతులు ముందస్తు పర్యవేక్షణ, శాస్త్రీయ సాగు విధానాలు, సమగ్ర పురుగుల యాజమాన్యాన్ని పాటిస్తే ఎలాంటి ఆందోళన అవసరం లేదు. సమయానికి తీసుకునే సరైన నిర్ణయాలు పంటను రక్షించడమే కాకుండా, అధిక దిగుబడి, మెరుగైన నాణ్యత మరియు రైతు ఆదాయాన్ని కూడా కాపాడుతాయి. రైతులు అపోహలను నమ్మకుండా స్థానిక వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలను పాటిస్తూ శాస్త్రీయ వ్యవసాయాన్ని అవలంబించడం ద్వారా పంటలను విజయవంతంగా సంరక్షించుకోవచ్చు.

## ధర్మారంలో జయశంకర్ జయంతి వేడుకలు

కోరుట్ల రూరల్, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)

కోరుట్ల మండలంలోని ధర్మారం గ్రామపంచాయతీలో గురువారం తెలంగాణ జాతిపిత గా పేరుగాంచిన ప్రొఫెసర్ జయశంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ




సందర్భంగా గ్రామ సర్పంచ్ దోడ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ ఆయన తెలంగాణకు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ఆవిర్భావంలో కీలకపాత్ర వహించిన ఆయనకు తెలంగాణ ప్రజానీకం రుణపడి ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణేష్, పంచాయతీ కార్యదర్శి సల్మా సుల్తాన్, అంగన్వాడి టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉండేడ లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

### రూ.10 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టిన గ్రామ సర్పంచ్ ఆవుల మమత తిరుపతి

ఎండపల్లి, ఆగస్టు 6, ప్రజా జ్యోతి:

మండలంలోని ఉండేడ గ్రామంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో ఐకేపీ నుండి స్మశానవాటికకు వెళ్ళే దారికి, రూ.10 లక్షల ఉపాధి హామీ



నిధులతో 240 మీటర్ల వరకు మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం గ్రామ సర్పంచ్ ఆవుల మమత తిరుపతి యాదవ్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.స్మశానవాటికకు వెళ్లే మార్గం సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతు రవి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడికి పెద్దపీట.. దమ్మనపేటకు ప్రశంసలు

మేడిపల్లి,ఆగస్టు 6 ప్రజా జ్యోతి:

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో మేడిపల్లి మండలం దమ్మనపేట గ్రామం ఆదర్శంగా నిలిచింది. గ్రామ సర్పంచ్ తొగరి రాజమణి–లక్ష్మీపతి నాయకత్వంలో ప్రజాప్రతినిధులు,



గ్రామస్థులు కలిసి "ప్రైవేట్ పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ పాఠశాలే ముద్దు" అనే నినాదాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చారు. ప్రైవేట్ పాఠశాలల బస్సులు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలు, విద్యా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఫలితంగా ఈ విద్యా సంవత్సరంలో 100 మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఈ కృషిని గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము సర్పంచ్‌ను సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దమ్మనపేట గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు.

## గవర్నమెంట్ పంపిణి చేసిన పిడిఎస్ బియ్యాన్ని అమ్మిన కొన్న నేరమే

### గొల్లపల్లి ఎస్సై ఎం కృష్ణ సాగర్ రెడ్డి

గొల్లపల్లి ఆగష్టు 6 ప్రజాజ్యోతి:

గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో గురువారం రోజున గొల్లపల్లి ఎస్సై ఎం కృష్ణ సాగర్ రెడ్డి మండల రెవెన్యూ శాఖ సిబ్బంది ఆర్ఐ బాపురెడ్డి జీపీఓ కిషన్ తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానాస్పద ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పంపిణీ చేసే బియ్యాన్ని ఎవరూ అక్రమంగా నిల్వ ఉంచరాదని గ్రామ ప్రజలకు సూచించారు ఎస్సై ఎం కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, కొనుగోలు చేయడం లేదా విక్రయించడం చట్టవిరుద్ధమని తెలిపారు ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ప్రజలు ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు లేదా అక్రమ రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా రెవెన్యూ అధికారులకు తెలియజేసి సహకరించాలని కోరారు




# పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### వసతుల కల్పనలో ఇబ్బందులు రానీయొద్దు: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి ):

పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ




అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి , అదనపు డీసీపీ వెంకటరమణతో కలిసి వివిధ శాఖల అధికారులతో పంద్రాగస్టు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వేడుక సజావుగా సాగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రోటోకాల్ సమస్య తలెత్తకుండా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేదిక వద్ద సీటింగ్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.

దేశభక్తి పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం కురిసినా ప్రోగ్రాం కు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని.. ప్రోటోకాల్ నిబంధనలు పాటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు.

**స్టాల్స్, శకటాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి:**

వివిధ శాఖల పనితీరు తెలిసేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఆర్టీసీ, వైద్యశాఖ, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల పనితీరు తెలిసేలా ప్రత్యేక స్టాల్స్ , శకటాలు ఏర్పాటు చేయించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలతో కూడిన స్టాల్స్, శకటాలు ఏర్పాటు



చేయాలన్నారు.

సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో తయారుచేస్తున్న ఉత్పత్తులను ప్రదర్శించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల శకటం, డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలతో శకటం ఏర్పాటు చేయాలన్నారు.ఎల్ నినో వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా తీసుకుంటున్న చర్యలతో స్టాల్ ఏర్పాటు చేయాలని ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఫిషరీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్, ఫైరింజన్ అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, పార్కింగ్ లో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశంసా పత్రాలు అందించేందుకు ఉత్తమ పనితీరు కనబరిచే ఉద్యోగులను ఎంపిక చేయాలని సూచించారు.వేడుకలకు హాజరయ్యే అతిథులు, స్వాతంత్ర్య సమర యోధులు, ప్రజలకు విద్యార్థులకు మీడియా కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అవసరమైన తాగునీరు, టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలి

### అపార్" నమోదు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 6( ప్రజాజ్యోతి ):

సెర్ప్, విద్యా శాఖ ఉన్నతాధికారులతో డిఆర్డిఏ, మెప్మా, జిల్లా విద్యా శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల యూనిఫామ్ పంపిణీ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.విద్యాశాఖకు సంబంధించి వివిధ అంశాలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో




సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్డిఏ, మెప్మా, విద్యా శాఖ సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలని, పంపిణీకి ముందు యూనిఫామ్ నాణ్యతను పరిశీలించాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలియజేసే "అపార్" నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆధార్ లో పొరపాట్ల వల్ల రిజిస్ట్రేషన్ ఆలస్యమైతే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఆధార్ సరి చేయించాలని, ప్రధానోపాధ్యాయులు ఈ బాధ్యత తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, 95 శాతం విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను ఎంఈఓలు పరిశీలించాలని, అవసరమైన చోట వసతులు కల్పనకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. వర్షాల కారణంగా పాఠశాలలో ఇబ్బందులు లేకుండా చూడాలని, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం కావాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లో నిర్దేశిత లక్ష్యం నిండే వరకు విద్యార్థులను చేర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యా శాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాధికారి చైతన్య జైని, ఏ.డి ప్రశాంత్ రెడ్డి, కో ఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఎమ్.ఈ.ఓలు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో జీపీఓ అరెస్ట్

మెట్‌పల్లి, ఆగస్టు 6, ప్రజా జ్యోతి:

పాస్‌బుక్‌లో తప్పుగా నమోదైన పేరును సరిచేసేందుకు రూ.5 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా గ్రామ పరిపాలన అధికారి (జీపీఓ) ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూరు గ్రామపంచాయతీలో గ్రామ పరిపాలన అధికారిగా పనిచేస్తున్న రాజేష్, అదే గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి పాస్‌బుక్‌లోని పేరు సరిచేయడానికి రూ.5 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో



బాధితుడు మల్లేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్ని, నిర్ణీత ప్రదేశంలో రాజేష్ రూ.5 వేల లంచం స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేసినా లేదా స్వీకరించినా వెంటనే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

## ఉపాధి అవకాశాలకు ఏఐ నైపుణ్యాలే కీలకం

కొడిమ్యాల, ఆగస్ట్ 06,(ప్రజాజ్యోతి):

మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూహెచ్ కళాశాల (అటానమస్)లో టాస్క్,ఐ బ్రీఎమ్, ఎడునెట్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బీటెక్ మూడో సంవత్సరం ఈసీఈ, సీఎస్ఈ, ఐటీ విద్యార్థులకు నిర్వహించిన మూడు రోజుల ఏఐ & క్వాంటమ్ కంప్యూటింగ్ శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఆగస్టు 4 నుంచి 6 వరకు నిర్వహించిన ఈ శిక్షణలో ఐబీఎమ్–ఎడునెట్ మాస్టర్ ట్రైనర్ పి. అజయ్ రెడ్డి ఏఐ మోడలింగ్, ఐబీఎం బిఓబి టూల్, రాగ్ ఆధారిత సాంకేతికతలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. చివరి రోజున విద్యార్థులు క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ డా. జి. నరసింహ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలు విద్యార్థుల ఉపాధి అవకాశాలను






పెంచుతాయని తెలిపారు. టిపిఓ డా. బి. సతీష్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

## ఘనంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు

కొడిమ్యాల, ఆగస్ట్ 06,(ప్రజాజ్యోతి):

మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి



పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహణ

ముస్తాబాద్, ఆగస్టు 6( ప్రజా జ్యోతి ):

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ముస్తాబాద్ మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో



ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి సంఘం నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలను, ఉద్యమానికి అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆయన జీవితాంతం చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జయశంకర్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో ఐక్యత, సేవాభావం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని, ఆయన కలలు కన్న తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని నాయకులు సూచించారు. అనంతరం జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పిస్తూ ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల స్వర్ణకార సంఘం నాయకులు, సభ్యులు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, గౌరవ ప్రదంగా జరిగింది.

### తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఘన నివాళి

ముస్తాబాద్: ఆగస్టు 6( ప్రజాజ్యోతి ):

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ముస్తాబాద్ మండలం బంధనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బంధనకల్ గ్రామ సర్పంచ్, ముస్తాబాద్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు చిగురు నరేష్ మాట్లాడుతూ, ప్రత్యేక




తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం, మార్గదర్శకత్వం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవ్య, జీపీఓ రాజు, వార్డు సభ్యులు చింతల శరత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల ప్రశాంత్, బీఆర్ఎస్ నాయకులు మోట్ల వెంకటేష్, చందు, గ్రామ పెద్దలు చిగురు మధు, పురుషోత్తం, గ్రామ యువకులు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## కరీంనగర్ నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 6(ప్రజాజ్యోతి ):

కరీంనగర్ నగరాన్ని గ్రీన్ సిటీగా మార్చడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వనమహోత్సవ కార్యక్రమాల నిర్వహణ, ప్రణాళికలపై అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. నగరంలో 3.50 లక్షల లక్ష్యాన్ని పూర్తి చేసేలా తీస్కునే చర్యల పై పలు సూచనలు చేస్తూ... ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరంలో 3.50 లక్షల మొక్కలు నాటి సంరక్షించే లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీస్కోవాలన్నారు. కరీంనగర్ నగరాన్ని గ్రీన్ సిటీగా మార్చాలని.... పచ్చదనం పెంపొందించేందుకు... వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. నగరపాలక సంస్థ ద్వారా గుర్తించిన స్థలాల్లో మియవాకీ, బ్లాక్, ఎవెన్యూ ప్లాంటేషన్ పద్దతుల్లో పండ్లు, పూలు, ఔషద మొక్కలను పెద్ద ఎత్తున నాటి పూర్తి స్థాయి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



నగర వ్యాప్తంగా నాటిన ప్రతి మొక్కను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ పోర్టల్ లో వాటి వివరాలను నమోదు చేసి డిజిటల్ ట్రాకింగ్ ద్వారా సంరక్షణ బాధ్యతలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. డివిజన్ల వారిగా ఇంటింటికి పండ్లు, పూలు, ఔషద మొక్కలను ఉచితంగా పంపిణీ చేసి... వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా ఖాళీ స్థలాలు, రోడ్డు డివైడర్లు, ప్రభుత్వ ప్రాంగణాల్లో కూడ పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు చర్యలు తీస్కోవాలన్నారు. వచ్చే వనమహోత్సవం నాటికి నగరంలో నాణ్యమైన మొక్కల లభ్యత కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరో రెండు నూతన నర్సరీలను ఏర్పాటు చేసి....అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నగరాన్ని సుందరంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమీషనర్ ఆయాజ్, డీఈ వెంకటేశ్వర్లు, హరితహారం ఇంచార్జ్ స్వామీ, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రమేష్, వనమహోత్సవ సిబ్బంది పాల్గొన్నారు.

## సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు

☆ సత్తుపల్లి విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నివాళులు

☆ ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దాం



**సత్తుపల్లి ఆగస్టు06(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించి, జీవితాంతం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కులు, అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ ,వ్యక్తిగత పదవులు, ప్రయోజనాల కంటే తెలంగాణ సమాజ సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం, నిరాడంబర జీవనం, నిష్కళంక వ్యక్తిత్వం, ఉద్యమం పట్ల అచంచలమైన అంకితభావంతో తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తిగా ఆయనను ప్రజలు స్మరించుకుంటున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా జయంతి కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఎస్. కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాశరావు ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి,ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఇలాంటి వ్యక్తి మన తెలంగాణలో ఉండటం మనం చేసుకున్న అదృష్టమని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కేశవరెడ్డి, ప్రకాశరావు, కమిటీ సభ్యులు రామిశెట్టి సుబ్బారావు, డి. కృష్ణయ్య, సాంబశివరెడ్డి, బి. మధుసూదన రాజు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలను స్మరించుకున్నారు.

### అనారోగ్యంతో మాజీ

## విద్యావలంటీర్ కొమ్ము రమేష్ బాబు మృతి

☆ గురువుకు సంతాపం తెలియజేసిన పలువురు శిష్యులు



**చింతకాని ఆగష్టు 06 ప్రజాజ్యోతి :-** మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన కొమ్ము రమేష్ బాబు అనారోగ్య కారణంగా మృతిచెందారు. ఆయన జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పలు సంవత్సరాలు విద్యావలంటీర్ గా పనిచేశారు. ఆయన దగ్గర విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు వివిధ ప్రభుత్వరంగ సంస్థలలో ఉద్యోగాలు పొందారు.ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు క్రమశిక్షణతో ఉండేవారని విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆయనశిష్యులు విద్యుత్ శాఖ ఖమ్మం రూరల్ ఏఈ టెక్నికల్ రజియా, మహబూబాబాద్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నర్సింగ్ ఆఫీసర్ రేబల్లి జ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం పంచాయతీ రాజ్ ఏ ఈ ఈ మొండితోక నవీన్ ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ కొమ్ము ప్రభు,ఉప సర్పంచ్ బుచ్చిబాబు బిఆర్ యస్ గ్రామ అధ్యక్షులు షేక్ మధార్,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బద్రి కాశి, బి జే పి మండల ప్రధాన కార్యదర్శి గోదా మంగయ్య గ్రామ పెద్దలు నంజాల అప్పారావు,కంచుమర్తి నరేష్ బాబు, పోటు నాగేశ్వరరావు,బద్రి నాగేశ్వరరావు, తెల్లబోయిన గోపి తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు.

### బొమ్మ విద్యా సంస్థల

## వైస్ చైర్మన్ సత్యప్రసాద్‌కి ఘన నివాళి

☆ నివాళులు అర్పించిన సొసైటీ చైర్మన్ తుపాకులు ఎలగొండ స్వామి



**ముదిగొండ ఆగస్టు 6(ప్రజాజ్యోతి)** ఖమ్మం నగరంలోని బొమ్మ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సత్యప్రసాద్ మృతి పట్ల ముదిగొండ మండల సొసైటీ చైర్మన్ తుపాకులు ఎలగొండ స్వామి సంతాపం తెలిపారు.వారి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల రాష్ట్ర చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మృతి సత్యనారాయణ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,మద్దినేని రమేష్,పంది రాజు తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేషన్ డివిజన్లలో

## ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలి

☆ పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 6,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం కార్పొరేషన్ లోని డివిజన్లలో స్ట్రీట్ లైట్లు (విద్యుత్ దీపాలు) లేకపోవడం వలన ఆయా ప్రాంతాలు అంధకారంగా తయారయ్యాయని, తక్షణమే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి కోరారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న విమలాదేవి మాట్లాడుతూ వీధిదీపాలు లేకపోవడం వలన పాములు, క్రిమి కీటకాలు సంచరిస్తున్నాయని, దొంగలు పడుతున్నారని, సత్వరమే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యాన్ని మెరుగు పరిచి ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో పాత పాల్వంచ లో, డ్రైన్లలో చెత్తా, చెదారం కొట్టుకు వచ్చాయని, సరైన సిబ్బంది లేకపోవడం వలన ఇబ్బందులకు గురి అవుతున్నామని, పారిశుధ్య సిబ్బందిని పెంచి, శానిటేషన్ పనులు మెరుగు అయ్యేలా చర్యలు చేపట్టాలని విమలాదేవి కోరారు , అదేవిధంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, పాత పాల్వంచ లోని 46వ డివిజన్‌లో కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్లు ఏర్పాటు చేయలేదని, దానివలన కొంత మంది కి మంచి నీటి సరఫరా అందడం లేదని, సత్వరమే స్పందించి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్, కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, కమిషనర్ సుజాతలు సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశించారు.

## రూ.3.50 కోట్ల గంజాయి కాల్చివేత

☆ 696.1 కేజీల అదేశాల మేరకు దహనం



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 6,(ప్రజా జ్యోతి)** ఖమ్మం జిల్లా కొత్తగూడెం జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలో పట్టుబడిన రూ. 3.50 కోట్ల విలువ చేసే 696.1 కేజీల గంజాయిని ఖమ్మం డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి అదేశాల మేరకు గురువారం దగ్ధం చేశారు, కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో 316.07 పేజీల గంజాయిని, భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లోని 329.51 కేజీల గంజాయిని, పాల్వంచ ఎక్సైజ్‌స్టేషన్‌లో 43.62 కేజీల గంజాయిని, మణుగూర్ ఎక్సైజ్ స్టేషన్ లోని 6.9 కేజీల గంజాయిని ప్రభుత్వ అమోదం పొందిన ఏ డబ్ల్యూఎస్ కన్సెటెనింగ్ గొపాల్‌పేట్ తల్లాడ మండలంలోని గంజాయి కాల్చివేత పరిశ్రమలో కల్చివేశారు.నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలోని 32 కేసుల్లో పట్టుబడిన గంజాయిని దహనం చేయాలని ఖమ్మం డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఈఎస్ శ్రీనివాసరెడ్డి సీఐలు ఇతర సిబ్బంది కలిసి గంజాయిని కాల్చివేశారు.



### ఆత్మహత్యాయత్నం చేసిన నిరుద్యోగి

## గడ్డం వేణుకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

☆ రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేత



**ముదిగొండ ఆగస్టు 6(ప్రజా జ్యోతి )** ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం భద్రయ్య కుమారుడు గడ్డం వేణును బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసిన గడ్డం వేణు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల కాకపోవడం, గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు రాకపోవడం, కుటుంబ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటం, తల్లి అనారోగ్యంతో బాధపడుతుండటం వంటి కారణాలతో తీవ్ర మనోవేదనకు గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి లేఖ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి ప్రశాంత్ ఆసుపత్రికి తరలించడంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటన తెలిసిన వెంటనే బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు నిరంతరం కుటుంబానికి అండగా నిలిచారు. పార్టీ జిల్లా నాయకత్వంతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు రూ.50,000 నగదు ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆసుపత్రి చికిత్స ఖర్చులను భరించారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బాధిత కుటుంబానికి రూ.1,00,000 ఆర్థిక సహాయం ప్రకటించగా ఆ మొత్తాన్ని మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సలీమున్నిసా బేగం, వైస్ సర్పంచ్ రమాదేవి, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు వాచ్చేపల్లి లక్ష్మారెడ్డి, మండల కార్యదర్శి గడ్డ వెంకటేశ్వర్లు గౌడ్, మండల నాయకులు మచ్చ సీతారామయ్య,పాము సిల్వరాజు ఏలూరి రమేష్, ధనియాకుల వీరస్వామి, గురుమూర్తి, కోటేష్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అనుచరులు నాలాబాల హరీష్, పాలంచ రాజేష్, కొత్తగూడం కార్పొరేటర్,కొమ్మూరి రమేష్, సంజీవరెడ్డి, నరసింహారావు, మడికంటి శ్రీను, వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, న్యూ లక్ష్మీపురం గ్రామ వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు 'సన్న' భరోసా!

☆ దేశంలోనే ఉచిత సన్న బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ: మంత్రి పొంగులేటి

☆ ఈశ్వరమాదారంలో మూడు నెలల ఉచిత రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించిన శ్రీనివాస రెడ్డి







**పాలేరు ఆర్.సీ ఆగస్టు 06 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల ఆహార భద్రతకు పెద్దపీట వేస్తూ నాణ్యమైన సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి ప్రతినెలా 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామంలోని చౌక ధరల దుకాణంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి లబ్ధిదారులకు మూడు నెలల ఉచిత సన్న బియ్యాన్ని మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని ప్రజలు వినియోగించకుండా విక్రయించడం లేదా రీసైక్లింగ్ అక్రమాలకు గురికావడంతో ప్రభుత్వ ధనం తీవ్రంగా వృథా అయ్యేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం ఎంతో నాణ్యంగా ఉండటంతో లబ్ధిదారులే స్వయంగా వండుకుని తింటున్నారు. రేషన్ దుకాణాల్లో ఒక్క గింజ తక్కువ వచ్చినా డీలర్లను ప్రశ్నించే స్థాయికి ప్రజల్లో చైతన్యం రావడం శుభపరిణామమని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు.

**మారిన పరిస్థితి సంతోషకరం లబ్ధిదారులు**

గతంలో ఇచ్చే బియ్యాన్ని తినలేక బయట విక్రయించేవాళ్లమని, ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం నాణ్యత ఎంతో బాగుండటంతో ఇంట్లోనే వినియోగిస్తున్నామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తమ కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరుస్తోందని హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్ వై. సైదిరెడ్డి, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

## అధికారపక్షమైనా.. ప్రతిపక్షమైనా.. ప్రజల పక్షమే ఎర్రజెండా

☆ కూనంనేని సాంబశివరావు

☆ ఈ బయ్యారంలో సీపీఐ ప్రజా చైతన్య యాత్రకు ఘన ప్రారంభం

☆ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని హామీ







**పినపాక, ఆగస్టు 6(ప్రజాజ్యోతి)** పినపాక మండలం ఈ బయ్యారంలో సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. అనంతరం హమాలీ సంఘం కార్యాలయం, క్రాస్‌రోడ్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అలాగే కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరం క్రాస్‌రోడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ప్రజల పక్షాన నిలబడేది ఎర్రజెండానే అని అన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తూ రైతులు, కార్మికులు, పేద ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, ఎరువులు, పురుగుమందుల ధరల పెరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా కొత్తగూడెం జిల్లా రైతులకు సాగునీరు అందించడంతో పాటు, బీటీపీఎస్, సీతారామ ప్రాజెక్టుల కారణంగా భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు తగిన నష్టపరిహారం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. పినపాక, కరకగూడెం మండలాల్లో పోడు భూముల వివాదాలను ప్రస్తావించిన సాంబశివరావు, పోడు రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. బందాగిరినగరం పోడు భూముల నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ భాషా, మండల కార్యదర్శి తోగటి కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డం మనోహరాచారి, పత్తిపాటి నాగేశ్వరరావు, కారం రమేష్, మండల సహాయ కార్యదర్శులు కప్ప వెంకటేశ్వర్లు, హమాలీ సంఘం నాయకుడు కాసు జంపయ్య, సీపీఐ సీనియర్ నాయకుడు కమిశెట్టి రామారావు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నవజాత శిశువుల కంటి పరీక్షలు ప్రతి శిశువుకు తప్పనిసరిగా నిర్వహించాలి

☆ యూనివర్సల్ న్యూ బోర్న్ బేబీస్ ఐ స్క్రీనింగ్ (ఆర్క్ లైట్ ఎగ్జామినేషన్) శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 6,(ప్రజా జ్యోతి)** నవజాత శిశువులలో పుట్టుకతో వచ్చే కంటి లోపాలను (నెలలోపు) ప్రారంభ దశలోనే గుర్తించి, వారికి సకాలంలో చికిత్స అందించేందుకు ప్రతి శిశువుకు జననం అనంతరం కంటి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఎన్‌బి బ్లెస్ కింద నిర్వహించిన యూనివర్సల్ న్యూ బోర్న్ బేబీస్ ఐ స్క్రీనింగ్ -- ఆర్క్ లైట్ ఎగ్జామినేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ , అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవజాత శిశువులలో కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా భవిష్యత్తులో అంధత్వాన్ని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి శిశువుకు నాణ్యమైన కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

**అనంతరం**

అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణలో ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారం రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో జన్మించే ప్రతి నవజాత శిశువుకు ఆర్క్ లైట్ పరికరం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి, అనుమానిత కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని ఎం ఎల్ పి హెచ్ లు, ఏఎన్ఎం లకు సూచించారు. ఈ శిక్షణ ద్వారా ఆరోగ్య సిబ్బంది నైపుణ్యాలు మరింత మెరుగుపడి చిన్నారులకు నాణ్యమైన సేవలు అందుతాయని తెలిపారు. శిక్షణలో ఆర్క్ లైట్ పరికరం వినియోగం, రెడ్ రిఫ్లెక్స్ పరీక్ష, పుట్టుకతో వచ్చే కంటి లోపాల గుర్తింపు, రిఫరల్ విధానం వంటి అంశాలపై ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ నిపుణులు సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డాక్టర్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రోగ్రాం ఆఫీసర్, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ప్రతినిధులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యం

## రేపాక సర్పంచ్ కాత మల్లేశం

ఇల్లంతకుంట ఆగస్టు 6(ప్రజా జ్యోతి) తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం అని రేపాక సర్పంచ్ కాత మల్లేశం అన్నారు. గురువారం రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక





అంగన్వాడీ కేంద్రం -3లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సర్పంచ్ మల్లేశం మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ఎంతో ముఖ్యమని, తల్లి పాలలో శిశువుకు రోగానిరోధక శక్తినిచ్చే పోషకాలు ఉంటాయని తెలిపారు. పుట్టినప్పటి నుండి శిశువుకు మొదటి ఆరు నెల్ల వరకు తల్లి పాలు అవసరమని, తల్లి పాలతోనే శిశువులో ఆరోగ్యాకరమైన ఎదుగుదల ఉంటుందని ల పేర్కొన్నారు. .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, అంగన్వాడి టీచర్ మీసాల హంసలీల, ఏఎన్ ఎం జయ, ఆశాకార్యకర్త పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమానికి జీవితం అంకితం

చొప్పదండి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి): ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారని చొప్పదండి మున్సిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస, కమిషనర్ నాగరాజు అన్నారు. జయశంకర్



జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 1960 తెలంగాణ ఉద్యమంలోను ,అంతకుముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్ ఇడ్లీ గో బ్యాక్ ఉద్యమంలోనూ పాల్గొన్నారని తెలిపారు. తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ గుర్రం రాజేందర్రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ పిట్టల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెహాల్కా ఎడిటర్‌కు పదేళ్ల జైలు

ముంబై,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు శిక్ష పడింది. 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ కీలక తీర్పు వెలువరించింది. పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. అతడు రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో జూనియర్ సహోద్యోగినిపై అత్యాచారం చేసిన కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు తాజాగా శిక్షను ఖరారు చేసింది. గతంలో ట్రయల్ కోర్టు ఈయనను నిర్దోషిగా ప్రకటించింది. ఆ తీర్పును బాంబే హైకోర్టు రద్దు చేసింది. 2013లో గోవాలో జరిగిన ఒక కార్యక్రమంలో హోటల్ లిఫ్ట్‌లో తనపై తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబర్‌లో అతడిని అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం 2021లో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాలు చేసింది. అప్పీల్‌ను విచారించిన హైకోర్టు ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేస్తూ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. కాగా, ఈ కేసులో తానే బాధితుడినని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తాను నిర్దోషినని పేర్కొంటూ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని వెల్లడించారు. తీర్పు వెలువడిన అనంతరం మీడియాతో మాట్లాడిన తేజ్‌పాల్, 'నేను ఎలాంటి నేరమూ చేయలేదు. ఈ తీర్పుతో నేను ఏకీభవించడం లేదు. న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాను' అని చెప్పారు. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, సురేంద్ర గాడ్లింగ్ లాగానే తానూ రాజకీయ కక్షసాధింపునకు గురయ్యానని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తెహెల్కా చేసిన దర్యాప్తు కథనాల వల్ల కొందరి రాజకీయ ప్రయోజనాలకు నష్టం కలిగిందని, అందుకే తనపై కేసు పెట్టారని ఆయన ఆరోపించారు. కోర్టు తీర్పు అనంతరం తరుణ్ తేజ్‌పాల్ మీడియాతో మాట్లాడారు. తనపై కొందరు గత 13 ఏళ్లుగా ప్రతీకారంతో రగిలిపోతున్నారని అన్నారు. ఈ కేసులో తనను పదిసార్లు నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసే ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, దీనిపై త్వరలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్, భీమా కోరేగావ్ కేసులో అరెస్టైన సురేంద్ర గాడ్లింగ్ పేర్లను తేజ్‌పాల్ ప్రస్తావించారు. వారిలాగే తానూ రాజకీయ కక్షసాధింపునకు గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, విచారణ సందర్భంగా గోవా ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వాదనలు వినిపించారు. బాధితురాలు పలుమార్లు నిరాకరించినప్పటికీ తేజ్‌పాల్ వినలేదని, 'నో అంటే నో' అనే ప్రాథమిక సూత్రాన్నే ఆయన పట్టించుకోలేదని కోర్టుకు వివరించారు. నేర తీవ్రత దృష్ట్యా ఆయనకు గరిష్ఠ శిక్ష విధించాలని కోరారు. అయితే, తనకిప్పుడు 62 సంవత్సరాలని, తానూ బాధితుడినేనని నమ్ముతున్నానని కోర్టుకు తేజ్‌పాల్ విన్నవించారు. తనకు భార్య ఉందని, శిక్ష విషయంలో దయచేసి కనికరం చూపాలని కోరారు. విచారణ అనంతరం న్యాయస్థానం తన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది. తెహెల్కా ఎడిటర్-ఇన్-చీఫ్‌గా తేజ్‌పాల్ ఉన్న సమయంలో బాధితురాలు ఆయన కింద పని చేసిందని, వారి మధ్య అధికార అసమానత స్పష్టంగా ఉందని పేర్కొంది. ఆ వృత్తిపరమైన ఆధిపత్యాన్ని ఆయన దుర్వినియోగం చేశారని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా బాధితురాలిపై జరిగిన అత్యాచారం నిజమేనని నిర్ధారించి తీర్పు వెలువరించింది. కాగా, గోవాలో 2013 నవంబర్ 7, 8 తేదీల్లో థింక్‌ఫెస్ట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తేజ్‌పాల్ తనపై రెండు సార్లు అత్యాచారం చేశాడని పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

# చిట్‌ఫండ్స్ బాధితులకు భారీ ఊరట

**93 మంది బాధితులకు రూ. 2,34,59,991/- చెక్కుల పంపిణీ**

**న్యాయం చేసిన ఆదిలాబా ద్ జిల్లా పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన బాధితులు**

**ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లోనే పెట్టుబడులు పె ట్టాలి**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజ న్**

ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 6, (ప్రజా జ్యోతి ): కనకదుర్గ చిట్‌ఫండ్స్‌లో పె ట్టుబడులు పెట్టి సంవత్సరా లుగా తమ సొమ్ము కోసం ఎదురుచూస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 93 మంది బాధితులకు న్యా యం జరిగింది. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ చొరవతో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాకు చెందిన దాదాపు 93 మంది బాధితుల కు రావలసిన రూ.2,34,59, 991/- విలువైన చెక్కులను అందజేశారు. కనకదుర్గ చి ట్‌ఫండ్స్ యాజమాన్యం బా ధితులకు చెల్లించాల్సిన డ బ్బులను తిరిగి ఇవ్వక పో వడంతో, బాధితుల ఫిర్యా దు మేరకు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ ఆదేశా ల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.ఈ కేసుకు సంబం ధించి మరికొన్ని ఫిర్యాదులు కూడా నమోదయ్యే అవకా శం ఉందని నిందితుడికి తెలియజేయగా, బాధితులం దరికీ చెల్లించాల్సిన మొత్తాన్ని పూర్తిగా తిరిగి చెల్లించేం దుకు అతను అంగీకరించా డు. అందులో భాగంగా ఈ రోజు సబ్ రిజిస్ట్రార్ ఆధ్వ ర్యంలో 93 మంది బాధితు లకు రావలసిన రూ.2,34, 59,991/- విలువైన చెక్కుల ను పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ మాట్లా డుతూ, ప్రజలు అధిక లా భాల పేరుతో వచ్చే మోస పూరిత పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాల ని సూచించారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన బ్యాంకు లు, ఆర్థిక సంస్థలు, చట్టబ ద్ధంగా నమోదు చేయబడిన చిట్‌ఫండ్ సంస్థల్లో మాత్ర మే పెట్టుబడులు పెట్టాలని తెలిపారు. పెట్టుబడులు పె ట్టే ముందు సంబంధిత సం స్థకు ప్రభుత్వ అనుమతు లు, చట్టబద్ధత ఉన్నాయో లేదో తప్పనిసరిగా నిర్ధారిం చుకోవాలని ప్రజలకు సూ







చించారు. పైసా పైసా కూడ బెట్టిన సొమ్ము ఏళ్ల తరబడి నిలిచిపోయిన తమ డబ్బు లను తిరిగి అందించేందుకు కేసు నమోదు చేసి, నిందితు డిని అరెస్టు చేసి, నిరంతరం చొరవ తీసుకుని, ప్రజల సమస్యను పరిష్కరించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజ న్, ఐపీఎస్‌తో పాటు జిల్లా పోలీసు యంత్రాంగానికి బాధితులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్, ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్ స్పెక్టర్ కె. నాగరాజు, కనక దుర్గ చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి సర్పంచులే కీలకం

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 6( ప్రజా జ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సర్పంచులదేనని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్





అన్నారు. గురువారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారం తో సమావేశాలకు హాజరై సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఫోన్ కాల్స్‌కు స్పందిస్తూ, సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రతి మండలంలో పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధి, విద్యార్థులకు ఉచిత భోజనం, రవాణా సౌకర్యం కల్పించే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచాలని, ప్రతి గ్రామానికి కోటి రూపాయల నిధులతో రోడ్ల అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరుగుతున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, సర్పంచులు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహనతో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## పోలవరం-బనకచర్లకు

# అడ్డంకి

మొదటిపేజీ తరువాయి..

వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది. ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.



## ఇరాన్, ఒమన్ మధ్య

# కుదిరిన సంధి

మొదటిపేజీ తరువాయి..

ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి తెలిపారు. ప్రతిపాదిత మార్గానికి సంబంధించిన భౌగోళిక సమన్వయాలపై ఇరాన్, ఒమన్ మధ్య అవగాహన కుదిరిందని బఘాయి బుధవారం మీడియాకు వెల్లడించారు. కొన్ని మూడో పక్షాలు అడ్డుకోకపోతే, అంగీకరించిన కీలక అంశాలతో ఒక ఉమ్మడి ప్రకటనను ఖరారు చేస్తున్నట్లు ఆయన వివరించారు. గత రెండు నెలలుగా ఈ మార్గంపై ఇరు దేశాలు సంప్రదింపులు జరుపుతున్నాయని, దీనికి సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన, భద్రతాపరమైన అంశాలను ఇరాన్ సమీక్షిస్తోందని పేర్కొన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడుల కారణంగానే హార్మూజ్ జలసంధిని మూసివేశామని బఘాయి ఆరోపించారు. ఒమన్‌తో కుదిరిన ద్వైపాక్షిక అవగాహన వల్ల జలసంధిలో నౌకల ప్రయాణానికి పూర్తి భద్రత లభించినట్లు కాదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌పై అమెరికా సముద్ర దిగ్బంధనం, ఇతర బెదిరింపు చర్యలు కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, ఈ వారాంతంలో ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ లేదా పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘేర్ ఘలీబాఫ్.. పాకిస్థాన్ లేదా ఖతార్‌లలో పర్యటించే ప్రణాళికలేవీ లేవని బఘాయి తెలిపారు. అయితే, ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఆ దేశాలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. మరోవైపు, ఇరాన్-ఒమన్ మధ్య తాజా దౌత్య పరిణామాల గురించి అరాఘ్చీ తన ఇటలీ కౌంటర్‌పార్ట్ ఆంటోనియో తజానీకి ఫోన్‌లో వివరించారు.




# తెలంగాణ కోసం కడవరకు తపించిన జయశంకర్ సార్

## కేటీఆర్ పట్టుదలపై నమ్మకంతో వెన్నంటి వచ్చారు

## జయంతి సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,ఆగస్ట్6(ప్రజాజ్యోతి): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు మించి దక్షత, సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం అడుగుతుంది. ఢిల్లీ పార్టీ చేతుల్లో జుట్టు ఉంటే వాళ్లు ఆడించినట్లే ఆడాలి. అదే తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుందా..? అని కేటీఆర్ అడిగారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోలిస్తే



కమిట్‌మెంట్, తెలంగాణ సాధించాలనే మొండితనం ఉన్న నాయకుడిని ఒక్కరిని చూపించండి.. నేను మీ వెంబడి నడుస్తా అని అనేవారని, ఆయన మొహమాటం కూడా పడేది కాదని గుర్తు చేసుకున్నారు. దేవేందర్ గౌడ్ పార్టీ పెడితే వెళ్లి మీరు పోవొద్దు సార్ కేసీఆర్‌తో అసోసియేట్ అయి ఉన్నరని అంటే జయశంకర్ సార్ ఒక మాట చెప్పిండు.. ఎన్ని పార్టీలు వస్తే అంత మంచిది ఏం కాదు.. తెలంగాణ రాష్ట్రం రావాలే.. ఆ రాష్ట్రం వచ్చే క్రమంలో నేను వాళ్లకు తెలంగాణ కోసం స్పర్థ లేకుండా, సమాంతరంగా పనిచేయండి.. ఒకరికి ఒకరు కలహించుకోకండి.. ఎవరు చేసిన అల్టిమేట్‌గా మీరందరూ కోరుతున్నది తెలంగాణెళి కదా..చెప్పి వస్తనన్నారు.

తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో మళ్లీ నీళ్లకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు ఒక్క బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అయినా మాట్లాడిండా..? అదే మనవాడు ఉంటే గల్లా పట్టి అడిగేవాడని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 75వ సారి ఇవాళ ఆయన ఢిల్లీలో ఉన్నడు. ముఖ్యమంత్రి అయి 32 నెలలు కూడా కాలేదు.. రేపటితోనో, ఎల్లుండితోనో అవుతయి.

కానీ 13 రోజులకోసారి ఢిల్లీ పోతడు.. 2,3 రోజులు అక్కడుంటడు. దేహి దేహీ అని ఈ రోజు అక్కడ యాచిస్తున్నడు. అందుకే జయశంకర్ సార్ ఢిల్లీకి సామంతులుగా ఉండొద్దు.. స్వతంత్రులుగా ఉండాలే అని కోరుకున్నరని అన్నారు. ఎన్నటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తెలంగాణ కోసం ఒక స్వీయ రాజకీయ అస్థిత్వ పతాక ఉండాలే. ఎన్నటికైనా తెలంగాణ కోసం ఎలాంటి రాజీ లేకుండా ఎవరితో కాంప్రమైజ్ కాకుండా గొంతు విప్పితే ఒక సింహం లాగా గర్జించే విధంగా కేసీఆర్ తీరుగా గొంతు ఉండాలే.. అందుకే కాంగ్రెస్‌లో కలవొద్దు అని గట్టిగా వాదించిన నాయకుడు, మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967